హాస్యప్రియులకు, ఆప్తులకు

# ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

హాస్యానందం

మీ కోసం.... ప్రముఖ కార్టూనిస్టుల కార్టూన్ల పుస్తకాలు...

హాస్య రచయితల హాస్య కథల పుస్తకాలు

ఒకే చోట లభ్యమయ్యేట్లు హాస్యానందం ఏర్పాటు చేసింది.

ఎక్కడ?.... ఎప్పుడు?

35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో

జనవరి2వ తేదీ నుండి 12వ తేదీ వరకు

స్టాల్ నెం. 182

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, బందరు రోడ్డు, విజయవాడ


తెలుగులో
వెలువడుతున్న
ఏకైక
హాస్య
మాస పత్రిక
హాస్యానందం
సంపూర్ణ హాస్య మాస పత్రిక
జనవరి-2025
₹25
AI
ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్
ప్రత్యేక సంచిక
సంక్రాంతి శుభాకాంక్షలు

బాపు రమణ అకాడమీ
ఆత్రేయపురం-హైదరాబాద్

# బాపురమణ పురస్కారోత్సవం 2024

డిశంబర్ 15, ఆదివారం
ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్,
బంజారాహిల్స్,
హైదరాబాద్‌లో
ఈ పూతరేకుల పండుగ
జరిగింది.

బాపు పురస్కారం
ప్రముఖ కార్టూనిస్టు
శ్రీ సురేన్ద్ర గారు...

రమణ పురస్కారం
ప్రముఖ రచయిత
శ్రీ భువనచంద్ర గారు...

జీవన సాఫల్య పురస్కారం
ప్రముఖ రచయిత
శ్రీ ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణగారు

అభినందనలతో...
హాస్యానందం








తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

జీ'వనం'లో నవ్వు నవ వసంతం

# హాస్యానందం

జనవరి-2025
21వ సంవత్సరం
247 వ సంచిక

ముఖచిత్రం: ప్రకృతి కాంత(AI) ✦ కార్టూన్: సునీల్

Publisher& Editor- Ramu.P

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
Ph : 9849630637
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*FullPillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna, Bachi
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar,
GopalKrishna, Gandhi, Nagisetty,
Bomman, Dayakar, Sangram, Krishna

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar


*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
G.Venkat Reddy,
Srikanth sarma,
NCCF

| సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలు ఉచితం) | 2 సంవత్సరాల చందా-రూ.600/- (పోస్టల్ చార్జీలు ఉచితం) |
|---|---|

**జీవిత చందా- రూ.5000/-లు**

Gpay *or* Ppay # 9849630637

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు


| | | |
|---|---|---|
| వరాలు-వరం | - సింహప్రసాద్ | -18 |
| కవిరాజు కథ | - డా॥కాకాని పృథ్వీరాజు | -24 |
| కృత్రిమ మేత | - గంగాధర్ వడ్లమన్నాటి | -30 |
| సూరిబాబుతో AI సుందరి | - కంద్లకుంట శరత్ చంద్ర | -34 |
| చేట పెయ్యి మేధ | - సరసి | -38 |
| అసలైన కృత్రిమ మేధ! | - పి.వి.రామశర్మ | -40 |
| ఆర్టిఫిషియల్ లవ్! | - నల్లపాటి సురేంద్ర | -44 |


## స్పెషల్స్


| | | |
|---|---|---|
| ఏమిటీ AI ?... ఏమా కథ!? | -నాగిశెట్టి | -10 |
| AI Fun | | -11, 29 |
| ఏఐ మాయ | | -17,39,43 |
| బాపురమణ పురస్కారం-2024 ప్రదానోత్సవం | | -28 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| వాక్చిత్రం | -సుధామ | -16 |
| కొత్త పుస్తకాలు | | -25 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -46 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -48 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |



## సీరియల్


| | | |
|---|---|---|
| కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి | -12 |


## కార్టూన్ శీర్షికలు





| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -14 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -15 |
| నెల నెలా నవ్వుల వెన్నెల | | -32 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -37 |













## ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- శర్మ
- సాయికృష్ణ
- సునీల్
- తోపల్లి ఆనంద్
- శ్రీనివాస్
- రామ్‌శేషు
- గాంధీ
- ప్రసిద్ధ
- శేషిరెడ్డి
- ఆయుషి
- వాడ్రేవు
- మోహన్ కుమార్
- భాను
- అరుణ్
- బొమ్మన్
- సురేష్
- శర్మ
- దొరశ్రీ
- శేఖర్
- షేక్ సుభాని
- శిరి
- బీవీఎస్
- రంగాచారి
- ఆనంద్‌గుడి
- ప్రసాద్ కాజ
- అత్తలూరి
- వర్చస్వీ
- రవిశంకర్
- ఓంకార్
- రాగతిరమ
- పెండేల
- క్రిప్
- పద్మ
- ఎన్.పి.ఎస్.రావు
- లాల్
- నాగిశెట్టి
- ఎమ్.ఎమ్.మురళి
- టి.ఆర్.బాబు
- జెఎన్నెమ్
- పుష్ప
- శ్రీధర్
- వి.బాలకృష్ణ


**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించ పరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు... సన్నిహితులకు ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు!**

**మ**నిషి సృష్టించిన మరో అద్భుతం AI–ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్... అంటే కృత్రిమ మేధ!... ఇప్పుడిప్పుడే అందరికి పరిచయమవుతున్న ఈ ప్రక్రియ పూర్తిగా అర్ధం కాని అద్భుతం! ఎవరికి తెలిసింది వారు, వారి పరిజ్ఞానంతో 'దీని' గురించి మాట్లాడుతూ కొంతమందిచే 'ఆహాఁ' అనిపిస్తే... మరికొంతమందిని భయపెడుతోంది. దీని పరిణామం ఎలా ఉంటుందనేది భవిష్యత్తే తేల్చాలి. అయితే ఏ పరిజ్ఞానం అయినా మనం వాడే విధానం బట్టే ఉంటుంది. ప్రస్తుతం టెక్నాలజీ మన జీవన విధానాన్ని ఎంతో తేలిక చేసేసింది. అయితే 'దీన్ని', మంచి పనులు కంటే... చెడు చేయడానికే ఎక్కువగా వాడుతున్నారు. ఉదాహరణకి బ్యాంకు ఖాతాలనుండి డబ్బులు దోచుకోవటం!... బాధకరమైన మరో విషయం ఏమిటంటే...
ఈ 'విజ్ఞానం'తో మమేకమైపోయిన మనిషి, స్వతహాగా తనకున్న జ్ఞానం మరుగున పెట్టి, తను కూడా 'కృత్రిమ బుద్ధి' ని అలవరచ్చుకోవటం! తన 'అనుకూలత' కోసమే తన ఆలోచనలు మార్చుకుంటున్నాడు... ఎలాంటి భావోద్వేగాలు లేకుండా, ఎదుటివారి మనోభావాలను లెక్కచేయకుండా ప్రవర్తించటం... చేసిన పనికి (ఎలాంటిదైనా) ఒక లాజిక్‌ని సృష్టించటం...మనిషి పరిణామక్రమం మారిపోతున్నట్లు అన్పిస్తోంది.
ఇలానే కాలం గడిస్తే మనిషి కూడా 'కృత్రిమ మేధావి'గా రూపాంతరం చెందడం ఖాయం! మనసులో ఉన్నది ఒకటైతే... బయటకు మరోటి వ్యక్తపరుస్తూ 'సహజత్వం' కోల్పోతున్నారు 'ఈ' తరం అనేది చేదు నిజం! యంత్రాలకి బానిసలైపోయి... మనమూ యంత్రాలుగా మారకుండా స్వతహాగా మనకుండే 'బుద్ధి'తో ప్రవర్తించి 'మనిషిని' బ్రతికిద్దాం!

ఈ ప్రత్యేక సంచిక రూపొందించటం కోసం **'సహజ బుద్ధి'**తో కథలు, కార్టూన్లు పంపించిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు!
అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....









**✦తూలుగు రమణారావు అక్కరాపల్లి**

హాస్యానందం టీం కు నూతన సంవత్సరం 2025 శుభాకాంక్షలు. ఇకనుండి మనపత్రిక వెల 25 రూపాయలు అన్నారు. నిజం చెప్పాలంటే మార్కెట్‌లో వచ్చే పత్రికలతో పోలిస్తే ఇది చాలా తక్కువే. నవ్వులు పంచి ఆరోగ్యాన్ని కాపాడే ఇంత మంచి పత్రిక వెల 50 రూపాయలు పెంచినా తప్పేం కాదు. వేలకువేలు మందులకు తగలెట్టేకన్నా పాతిక రూపాయలు మానసిక జాడ్యాలను నయం చేసే పత్రిక కోసం కేటాయించడం సమాజానికి ఎంతో అవసరం.ఇక డిసెంబర్ నెలలో ప్రచురితం అయిన కార్టూన్స్ పదేపదే మనసును ఆకట్టుకున్నాయి. కొత్త పుస్తకాల గురించిన సమాచారం బాగుంది. పైడిమర్రి పద్మ గారి కథ అపాయంలో ఉపాయం, గాంధీ మనోహర్ గారి శీర్షిక నవ్వులాట ఆద్యంతం చదివించాయి.

**✦ శ్రీలేఖ పి.ఎస్., సికింద్రాబాద్**

**నూ**తన సంవత్సర (2025) శుభాకాంక్షలు. బాచిగారి 'మొక్క మనసు' కార్టూన్లు బావున్నాయి. బి.వి.ఎస్ గారి కార్టూన్ 'నెల రోజులు సెల్ ముట్టుకోనని మా ఆయనతో పందెం కాచానే' కడుపుబ్బా నవ్వించింది. వాక్చిత్రం (సుధామ)లో 'డిసెంబర్ పూలకు' ఇన్ని మంచి గుణాలు, పెక్కురంగులు, ఔషధ గుణాలు కలిగి ఉంటాయని తెలుసు కొని చకితులయ్యాము.

**✦ పి.వి.మధు నివ్రితి, హైదరాబాద్**

ప్రతినెల అట్టమీద కార్టూన్ హాస్యంయే గాక మేలుకొలుపు కూడా. (సమాజానికి సవాల్ అన్నట్టు). పొగాకు, మద్యం, వేగంగా వాహనాలు నడపటం వెనకాల యమభటులు- చావుకు లేక గాయాలకు ఆహ్వానం అని భేషుగ్గా చెప్పకనే చెబుతోంది కార్టూన్లు. రాముగారి సంపాదకీయం ఎం.బి.ఎ (పొరంకి) చిరునామా.

**✦ ఆర్.మధుసూదనరావు, కంచి**

**డి**శంబర్ హాస్యానందం చాలా బాగుంది.'కార్టూనిస్టుల కార్తిక వన భోజనాలు' వివరాలు చదివి థ్రిల్ ఫిలయ్యాము. కార్టూనిస్టులు అందరూ ఒక చేరితే అక్కడ నవ్వుల వర్షమే కదా? ఆ చిత్రం ఊహించుకుంటేనే నవ్వొస్తుంది. దీన్ని నిర్వహించిన శ్రీమతి పద్మగారికి అభినందనలు. హాస్యానందం చిరకాలం వర్ధిల్లాలి!

# NCCF
**(North Coastal Andhra Cartoonists Forum )**

## వారి ఆధ్వర్యంలో కార్టూన్ల పోటీ 2025

**విశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా జాతీయస్థాయి కార్టూన్ పోటీలు NCCF వారు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలో వచ్చిన కార్టూన్లలో అత్యుత్తమమైన పది కార్టూన్లను ఎంపికచేసి ఒక్కోదానికి రూ 1000/- చొప్పున నగదు బహుమతి అందజేయనున్నారు.**

**నిబంధనలు:**

✦ దేశవిదేశాల్లోనున్న తెలుగుకార్టూనిస్టులందరూ పాల్గొనవచ్చును.

✦ ప్రతీ కార్టూనిస్టూ మూడు కార్టూన్ల వరకు పంపవచ్చును

✦ A4 సైజులో 300 dpi లో jpg / jpeg ఫైల్ ఫార్మాట్‌లో కలర్‌లోగానీ/ బ్లాక్ అండ్ వైట్‌లో గానీ వేసి పంపాలి.

✦ మీకు నచ్చిన సబ్జెక్టుపై వినూత్నంగా వేసిన నవ్వించే కార్టూన్లను మాత్రమే పంపండి. కేప్షన్ లెస్ కార్టూన్లకు ప్రాధాన్యత ఉంటుంది.

✦ మీ కార్టూన్లను **31-1-2025 తేదీలోగా** ఈ క్రింది ఈ మెయిల్ కు పంపవలెను.

**nccfvisakhapatnam@gmail.com**

✦ బహుమతి పొందిన 10 కార్టూన్లు మార్చి2025 హస్యానందం సంచికలో ప్రచురించబడతాయి.

✦ ఈ పోటీలు హాస్యానందం వారి సౌజన్యంతో నిర్వహించ బడుతుంది.

✦ ఇతర వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

**టి ఆర్ బాబు- 9440561425**

**లాల్- 9247783307**

# 30 వేల రూపాయల బహుమతులు

## 10 కథలు 20 కార్టూన్లు

## ఒకోదానికి 1000 రూపాయలు



### పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ

'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ వారి తల్లిదండ్రుల స్మారకార్థం ఈ మినీ హాస్య కథల పోటీ నిర్వహిస్తున్నారు.

**ఒక్కో కథకి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు**

కథలు ఎంత చిన్నవైతే అంత ప్రాముఖ్యం. (అచ్చులో అరపేజీ దాటకూడదు) కొసమెరుపు అదిరిపోవాలి! ఇవే నిబంధనలు... ఇవి కచ్చితంగా పాటించండి!... బహుమతి గెలుచుకొండి!

### విశ్వావసు నామ ఉగాది సందర్భంగా నిర్వహిస్తున్న కార్టూన్ల పోటీ

**అంశం:**
**భూమ్మీద మానవులు లేకపోతే?**

మన చేతులారా చేసుకుంటున్న కొన్ని పనుల ప్రభావం వలన జరిగే పరిణామాలకు ఫలితాలను కళ్ళకు కట్టే ప్రయత్నమే ఈ అంశం!

**ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు చొప్పున 20 బహుమతులు**

కార్టూన్ల పరమావధి నవ్వించడమే! నవ్విస్తూనే, భయ పెట్టకుండా ఈ అంశాన్ని ప్రస్తావించాలి. అంతర్లీనంగా కారణం చెబితే బాగుంటుంది.

ఈ మెయిల్‌కి కథలు పంపవలెను-hasyanandampoteelu@gmail.com

కథలు, కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ **ఫిబ్రవరి-10, 2025**

బహుమతి ప్రదానోత్సవ వివరాలు హాస్యానందం మార్చి సంచికలో ప్రచురించబడతాయి.


## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు


**4000 రూపాయల బహుమతులు**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**



'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**

కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.


- మొదటి బహుమతి- **రూ.500/-లు**
- రెండవ బహుమతి- **రూ.300/-లు**
- మూడవ బహుమతి- **రూ.200/-లు**





కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా బహుమతులే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!

# ఏమిటీ AI ?... ఏమా కథ!?

**కొ**త్త ఆవిష్కరణలు వచ్చినప్పుడు కొన్ని పాతతరం విషయాలు కొట్టుకుపోతాయి. అది సహజం! మార్పు కావాలి. అయితే మార్పుని అందరూ వెంటనే ఆహ్వానించలేరు. కొన్నాళ్ళకు గానీ ఆ మార్పుని అలవాటు చేసుకోలేరు. ఇప్పుడు AI...! ఎవరి నోట విన్నా...ఏ పనిలో నైన వినిపించే మాట ఇది. కృత్రిమమైన తెలివితేటలను వాడుకునే ఇందులో ఏముంది?.. ఏముంటుంది?

మానవ మేధస్సు ఎంత గొప్పగా ఆలోచించగలదో తెలిపే ఆలోచన ఉంది. ఇన్నాళ్లూ మానవుడు జంతువులనూ, పక్షులనూ మొదలైన వాటినే తనకు అనుగుణంగా పనిచేయించే నేర్పుని నేర్పించి కావలసి నట్లుగా పని చేయించుకున్నాడు. ఇప్పుడు యంత్రాలకి మేధస్సుని తగిలించి తాను కూడా ఆలోచించలేనంతగా వాటిని తయారు చేసి వాడుకోబోతున్నాడు. మనం చేస్తున్న ప్రతీ పనీ ఇకపై యంత్రాలు చేసేస్తాయి.

మనకి కావలసిన విధంగా... కావాలంటే ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా చదువు నేర్పిస్తుంది. ఏ సమయంలో కావాలంటే ఆ సమయంలో.

మిమ్మల్ని పరీక్ష చేసి మీకు ఏవిధమైన అనారోగ్యం ఉందో విశ్లేషించి మీకు కావలసిన కచ్చితమైన వైద్యం సూచిస్తుంది. ప్రస్తుతం ఉన్న వైద్యులలాగా మీ మీద ప్రయోగాలు చేయదు.

మీకు కావలసిన ఇల్లు మీరు సూచించిన పద్ధతిలో వీలయినంత తక్కువ ధరలో అత్యుత్తమ నాణ్యతతో మీకు కట్టించి ఇవ్వగలదు.

మీరు మీ వృత్తినీ ఆరోగ్యాన్నీ అనుసరించి ఏమేమి తినాలో ఏమేమి తినకూడదో చెబుతుంది. మీకు భవిష్యత్తులో ఇన్స్యూరెన్స్ అవసరం ఉండకపోవచ్చు.

దొంగలని పట్టుకోవడంలో, కల్తీని నిరోధించడంలో, జీవన ప్రమాణాల నాణ్యతని పెంచడంలో ఇంకా మనం ఊహించలేనన్ని విధాలుగా దీని సహకారం మనందరి జీవితాల్లో ఉంటుంది.



**కృత్రిమమేధ వలన కొందరికి నష్టం జరిగితే... మరి కొందరికి లాభం జరుగుతుంది. అయితే ఒక్కటి మాత్రం నిజం. దీనివల్ల జీవితాల్లో గొప్ప మార్పులు వస్తాయి... ఎందులోనైనా మంచీ చెడూ రెండూ ఉంటాయి. మనం చాకుతో కూరలూ తరగవచ్చు. చేయ్యీ కోసుకోవచ్చు. సైన్స్‌ని ఎలా ఉపయోగించు కోవాలో తెలుసుకుంటే నష్టం కంటే లాభమే ఎక్కువే ఉంటుంది.**

మీ బదులు మీకు ఏమి కావాలో అవే ఆలోచించి మరీ మీ పనులు మీరు ఊహించలేనంత వేగంగా చేసి పెట్టేస్తాయి.

మరి ఇది మంచిదేనా?.. అందరూ ఎందుకు దీనిని ఒక బూచి లాగా చూస్తున్నారు? ఎందుకంటే ఇది మనిషి మెదడు కంటే ఎన్నో వేల రెట్లు ఎక్కువగా ఆలోచించి పనిచేస్తుంది. దీనివల్ల మనుషుల అవసరం, పాత్ర దైనందిన కార్యక్రమాల్లో తగ్గిపోతుంది. మనిషి తన ఉనికిని కోల్పోతాడు. నిరుద్యోగం ప్రబలుతుంది. రోబోల పాత్ర ఎక్కువై అవి మనుషులని తమ చెప్పుచేతల్లోకి తీసుకుని మనుషులని బానిసలగా చేసుకుంటాయి. దానితో ప్రాకృతికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కొన వలసి వస్తుంది. మనిషి ఆలోచించడం మానేస్తాడు... ఇలా ఆలోచి స్తున్నారు అంతా!

అయితే ఇందులో కొంత నిజం లేకపోలేదు. కొంత వరకూ నిరుద్యోగ బెడద తప్పదు. అయితే అంతా చెడు జరుగుతుందన్నది అపోహ మాత్రమే. ఒక పెద్ద ఆవిష్కరణ జరిగినప్పుడల్లా పైకి వచ్చే భయమే ఇది. కానీ ఆలోచించండి. ఎంత సమయం మనకి మిగులుతుంది. జీవన విధానంలో ఎంత సౌలభ్యం ఏర్పడుతుంది.

పుస్తకాలు బట్టీ పట్టనక్కరలేదు. మనకు అర్థమయ్యేట్లుగా

అలాగే హాస్యం క్షణాల్లో సృష్టించి ఇస్తుంది. రచయితలూ, కవులూ, కార్టూనిస్టులూ అవసరం లేకుండానే సంపాదకులకి కంటెంట్ సృష్టించి ఇస్తుంది. మనమే పాటని రాసి సంగీతం సమకూర్చుకోవచ్చు. ఒక బాణీ నచ్చకపోతే మరొకటి క్షణాల్లో సమకూర్చుకోవచ్చు. మీ ఫ్రిజ్జుల్లో పదార్థాలు ఏవి తీసి పారేయాలో చెబుతుంది. దీని ఎక్స్‌పైరీ ఎప్పుడో చెబుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అంతే ఉండదు.


పైవాటిలో కొందరికి నష్టం జరిగితే మరి కొందరికి లాభం జరుగు తుంది. అయితే ఒక్కటి మాత్రం నిజం. దీనివల్ల జీవితాల్లో గొప్ప మార్పులు వస్తాయి... మంచీ చెడూ ఉంటుంది. మనం చాకుతో కూరలూ తరగవచ్చు. చేయ్యీ కోసుకోవచ్చు.


సైన్స్‌ని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుంటే నష్టం కంటే లాభం ఎక్కువే ఉంటుంది.

ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోపోయినా ఇది నిజం.

కొత్తని ఆహ్వానిద్దాం. మన జీవితాలకి ఎలా కావాలో, ఎంతవరకు కావాలో అంతవరకు వాడుకుందాం. దీనిని అంటరానిదానిలా చూసే కన్నా, అందిపుచ్చుకోవడంలోనే మేలు ఉందని నేను నమ్ముతున్నాను.

**-నాగిశెట్టి, విజయవాడ**


ఆఖరికి ఇది చెప్పినట్లుకూడా నేను వినాలా?!
AI
వాడ్రేవు
నువ్వు మనుషుల్లా AI ఉపయోగించవద్దు...
నా సొంత తెలివి వాడు...సరేనా..?!
AI
Fun
నా అవసరాలకు
తయారు చేయాలనుకున్నా..
కానీ ప్రోగ్రామింగ్‌లో
కాస్తా తేడా వచ్చింది!!
MOHAN KUMAR
అది నా సీటు....
AI
jobs
AI వలన
భవిష్యత్తులో
ఉద్యోగాలు
కనుమరుగు..






**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! బ్యాంకులో పని. సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. ఒకరోజు సాత్వికరావుని అరెస్టు చేయడానికి పోలీసులు బ్యాంకుకి వస్తారు. **ఆ తర్వాత...**

**"ఇప్పుడా చరిత్ర ఎందుగ్గానీ ముందా సాత్వికరావు పాట ఆపించమని రతీదేవికి చెప్పు. నాకు చిరాగ్గా ఉంది" అన్నాడు.**

**ఆ సమయానికి రతీదేవి గుడి దగ్గరే ఉన్నది. సరస్వతి సూచనలు అనుసరించి, ఇద్దరు ముగ్గురు భక్తుల్ని లోపలికి పంపింది.**

**ధ్వజస్థంభం దగ్గర నిలబడి రెండు చేతులూ గాలిలో సాచి ఎలుగెత్తి పాడుతున్న సాత్వికరావు మీదకి వాళ్ళు డబ్బులు విసిరేసరికి అతడు కంగారు పడి పాట ఆపేశాడు.**

**భార్యతో కలిసి అదే గుడి ముందు కాపు కాసిన మన్మథుడు చప్పున లేచి... "అదిగో వచ్చేస్తోంది" అన్నాడు ఉత్సాహంగా.**

ఏమి వస్తోందో అర్థం కాక రతి అటు చూసింది.

ఆలయ ప్రాంగణంలోకి అడుగుపెడుతోంది రాధ!

రతీదేవి లేచి నిలబడి, "ఇంక చూడండి. ఇద్దరినీ ఎలా ఒకటి చేస్తానో!" అంది ఆనందంగా.

ఈ లోపులో రాధ తిన్నగా రామాలయంలోకి వెళ్లి దణ్ణం పెట్టుకోసాగింది. పాట పూర్తి చేసిన సాత్వికరావు రాము లారిని కూడా ప్రసన్నం చేసుకుందామని ఆ గుళ్ళోకి వెళ్లి గంట కొట్టి కళ్ళు మూసుకున్నాడు.

అంతవరకూ గిరాకీ లేదని విచారంగా కూర్చున్న పూజారి, పక్క పక్కనే నిలబడ్డ ఇద్దరినీ చూసి ఆనందంతో పరుగు పరుగున వచ్చి ఇద్దరి నెత్తిన చెరో చెయ్యి ఉంచి...

"శీఘ్రమే సంతాన ప్రాప్తిరస్తు!" అన్నాడు.

ఆ మాటలు విని ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యంగా కళ్ళు తెరిచారు. అచ్చం సినిమాల్లో పూజారిలా వారిని మళ్ళీ దీవించి, దక్షిణ పళ్ళెం ముందుకు జరిపాడు.

"అయితే మళ్ళీ కొత్త నాటకం మొదలెట్టావన్నమాట!" అంది రాధ కోపంగా.

"నాటకమా?... నాటకం ఏమిటి!?"

"నన్ను వెంబడించటం, పక్కనే నిలబడి ఏమీ ఎరగనట్టు దణ్ణం పెట్టుకోవటం... ఇద్దర్నీ కలిపి ఆశీర్వదించమని పూజారికి డబ్బివ్వటం, పిల్లలు కలగాలని ఆయన ఆశీర్వదించటం..."

"మనకి పిల్లలు పుట్టాలంటే దానికి పూజారి ఎందుకు? పెళ్లి చేసుకుంటే... ఈయన ఆశీర్వాదం లేకుండానే మనకి పిల్లలు పుడతారు. కావాలంటే బెట్ కడతాను!" అన్నాడు రోషంగా.

"షటప్!" అంది రాధ.

"ఇంకోసారి మన పిల్లలు అంటే మర్యాదగా ఉండదు."

"ఆ మాట నేను అనలేదు. పూజారి అన్నాడు."

"అనమని నువ్వే డబ్బిచ్చావ్."

"ఇంకా ఇవ్వలేదు... ఇప్పుడిస్తే సంతోషం!" అన్నాడు పూజారి మధ్యలో కల్పించుకుని. సాత్విక్ నవ్వాడు.

"హుఁ" అంటూ వెళ్ళిపోయింది రాధ.

దూరం నుంచి ఇదంతా చూస్తున్న రతీదేవి ముఖం వాడిపోయింది.

మన్మథుడు నవ్వి, "పూజారి దీవించగానే ఇద్దరూ ఒకటయి పోతారేమిటి? మనమే ఏదైనా ప్రయత్నం చెయ్యాలి!" సాలోచనగా అన్నాడు.

"సరే. ఇంకో ప్రయత్నం చేద్దాం పదండి!" అంది భర్త చేయి పట్టుకుని లాక్కెళ్తూ.

సాత్వికరావు రోడ్డు మీదకి వచ్చేసరికి రాధ రోడ్డు మీద కుడి వైపుకి తిరగటం కనిపించింది.

మన్మథుడు చెయ్యి ఊపేసరికి జనం మొత్తం మాయమై దారి నిర్మానుష్యం అయిపోయింది. దూరంగా పోలీస్ విజిల్స్, తుపాకి పేలుస్తున్న శబ్దాలూ వినిపించసాగాయి.

సాత్విక్ గాభరాగా... "ఏమయింది?" అని అడిగాడు.

అతనితో మాట్లాడటం ఇష్టం లేకపోయినా జవాబు చెప్పక తప్పలేదు.

"ఊరేగింపులో రాళ్ళు విసిరారని పోలీసులు లాఠీ చార్జ్ చేసి కాల్పులు జరుపుతున్నారు." అన్నది ముఖం పక్కకి తిప్పుకుని.

అతడు ఏడవటం మొదలు పెట్టాడు.

హఠాత్తుగా అతడలా కన్నీరు పెట్టుకోవటం చూసి నివ్వెరపోయింది.

అప్రయత్నంగా ఆమెకు కూడా దుఃఖం కలిగింది.

ఇద్దరూ అలా కొంచెం సేపు కన్నీరు కార్చాక, సాత్విక్ ఓదారుస్తున్నట్టూ... "ఏడవకండి రాధగారూ! తప్పంతా నాదే... నాలాంటి పోలికలున్న మనిషి మరొకరు ఉన్నందువల్లే మీరిలా పొరపాటు పడుతున్నారని తెలిసి కూడా నేను మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. అందుకే అక్కడ గుళ్ళో ఆంజనేయుని ముందు అపరాధ భావంతో ఏడ్చాను. ఇప్పుడు ఇక్కడ మీ ముందు పశ్చాత్తాపంతో ఏడుస్తున్నాను" అన్నాడు.

"కాదు... తప్పు నాది. అక్కడ బ్యాంకులో మీ కాలరు పట్టుకుని నిలదీశాను. పోలీసు స్టేషనులో క్షమాపణ చెప్పించాను. ఇక్కడ రాము లారి గుళ్ళోనూ మిమ్మల్ని అపార్థం చేసుకుని మీ సున్నితమైన మనసులో గునపాలు దింపాను."


"వద్దు రాధా! అంతమాట అనకు. అపార్థాలు సాగర కెరటాల్లాటివి. సముద్ర తీరానే ఉంటాయి. లోపల నీళ్ళు నిర్మలం."


"ఈ రోజు నుంచీ మనిద్దరం మన మనసుల్ని చెరువుల్ని చేసుకుందాం సాత్విక్!"

"అలా ఎందుకు రాధా?"

"కెరటాలు సముద్రంలోనే ఉంటాయి...








చెరువుల్లో ఉండవు కదా? అందుకు!"

"నిజమే!... సీతని అపార్థం చేసుకోవటం రాముడికే తప్పలేదు. ఆయన దయ వల్లనే... ఆయన గుళ్ళోనే మన ఇద్దరి పొరపాట్లూ ఈ విధంగా పశ్చాత్తాపంతో ప్రక్షాళమయ్యాయి. ఇక ఏడవకు రాధ... నువ్వు ఏడుస్తోంటే నా మనసు సముద్రం...సారీ చెరువు అవుతోంది."

"మీరెంత మంచివారు సాత్విక్! మీ మంచి తనం తలుచుకునే కొద్దీ వద్దనుకున్నా నా కళ్ళ నుంచి నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి!" అన్నది రాధ.

అయిదు నిముషాల ముందే పోలీసుల దగ్గ రున్న టియర్ గ్యాస్-షెల్ వాళ్ళిద్దరి మధ్యకూ విసిరేసిన రతి, ఆ సంభాషణ విని ఆనందంతో పొంగిపోయింది.

మరో దిక్కునుంచి ఇదంతా పరిశీలిస్తోన్న ఇంద్రసతి కంగారు పడింది. వాళ్ళనలా వది లితే అట్నించి అటే కన్నీటి సముద్రంలో కలల పడవ వేసుకుని రిజిస్టర్ ఆఫీసుకి వెళ్ళిపోతా రని భయపడి, భర్తవైపు సాలోచనగా చూసింది.

అది అర్థం చేసుకుని ఇంద్రుడు సాత్విక్ దగ్గరకు పరిగెత్తుకు వెళ్లి... "నొక్కు!" అన్నాడు.

"ఎందుకు?"

"చెప్పిన పని చెయ్యి. ముందు నొక్కు!" అన్నాడు.

"నన్నెవరైనా నొక్కమంటే నొక్కను. నాకు నొక్కాలనిపిస్తేనే నొక్కుతాను!" రెండు నెలల క్రితం చూసిన మహేష్‌బాబు సినిమాలో డైలాగ్ గుర్తొచ్చి అన్నాడు.

"ముందు నువ్వు నొక్కి... తరువాత ఆమెని వాసన చూడమను!"

"చనువు తీసుకుని చేతిలో పెడితే... చెంప బ్రద్దలు కొడుతుందేమో".

"ప్రయత్నించటంలో తప్పు లేదుగా!... ఏడవకు. భాష్పవాయువుకి ఇది విరుగుడు!" అని నిమ్మకాయ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

సాత్విక్ దాన్ని గాఢంగా వాసన పీల్చి... ఆమెకిచ్చి కళ్ళు తుడుచుకుంటూ... "మన కన్నీళ్ళకి కారణం ఈ వాయువా?... ఇంకా నయం. నువ్వేదో పశ్చాత్తాపంతో ఏడుస్తు న్నావనుకున్నాను!" అన్నాడు.

"నేనెందుకు పశ్చాత్తాపపడాలి? నువ్వే ఏడ వాలి! నీలాంటి మోసగాళ్ళ ఏడుపు నిమ్మకాయ వాసన చూసినా ఆగకూడదు.".

ఇద్దరి మొహాల్లోనూ మళ్ళీ కోపతాపాలూ, రోషద్వేషాలూ తొంగి చూశాయి.

ఎవరి దారిన వాళ్ళు దూరం దూరంగా నడవసాగారు.

"వాళ్ళని కలపటం బ్రహ్మదేవుడికి కూడా సాధ్యం కాదు" నిస్పృహగా అన్నాడు మరుడు.


"ఎలా కాదో నేనూ చూస్తాను..." అంటూ రతీదేవి వరుణుని ప్రార్థించగానే, అకస్మాత్తుగా ఉరుములూ మెరుపులతో... భయంకరమైన వర్షం ప్రారంభమయింది.

సాత్వికరావు పరుగున వెళ్ళి ఓ రేకుల షెడ్‌లో చేరాడు. మరికొద్ది క్షణాల్లో రాధ కూడా వచ్చి అక్కడే నిలబడింది. ఇద్దరూ సగం తడిసి పోయారు.

దూరంగా పిడుగు పడింది.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని ఉలిక్కి పడ్డారు.

"హూఁ!" అంది అసహనంగా.



"హాఁ!..." అన్నాడు అతడు నిర్లిప్తంగా.


"ఇక్కడ కూడా నువ్వేనా?" అంది.

"నేను కూడా అదే ప్రశ్న వెయ్యొచ్చు. ముందు వచ్చింది నేను!" అన్నాడు.

"ఇంత అకస్మాత్తుగా వర్షం ఎలా వచ్చింది?" తనలో తనే బయటకి అనుకుంది.

"అంటే ఇప్పుడు వర్షం కూడా నేనే కురిపించానని నీ ఉద్దేశ్యమా?" కోపం నిండిన స్వరంతో అడిగాడు.

చిన్నపిల్లాడిలా అతడు ఉక్రోష పడటం చూసి, అంత చిరాకులోనూ ఆమెకు నవ్వొచ్చింది.




'అవతారం బాగానే ఉంది. రౌడీ వేషాలు వేయకుండా ఉన్నట్లయితే జెంటిల్‌మెన్‌లా ఉండేవాడు' అనుకుంది.

వాళ్లిదర్నీ పైనుంచి చూస్తోన్న రతీదేవి...

"కొట్టు!" అంది.

మన్మథుడు అర్థం కానట్టు చూశాడు.

"వాళ్ళు ప్రేమలో పడి వివాహం చేసుకునే వరకూ, ఎప్పుడు అవకాశం దొరికినా కొడుతూనే ఉండు!" అంది.

'అందగా మదనుడుండగా, విరిశరముల పదునుండగా' అని పాడుకుంటూ ఆ పూవింటి చెలికాడు ఆమెని బాణంతో కొట్టాడు.

ఆమె వెచ్చటి వంటి మీద తడి చినుకై పడి ఆ విరిబాణం ఆవిరి అయింది.

వర్షం పెద్దదయ్యింది. లయబద్ధంగా పడుతున్న వర్షపు చినుకులు షెడ్డు మీద మృదంగ శబ్దావధానాలయ్యాయి. వేపకొమ్మ వాయులీనమై రేకులపై మేఘమల్హార్ వాయించటం ప్రారంభించింది.

పూల బాణ ప్రభావంతో... ఆమె అతడిని మళ్ళీ పరీక్షగా చూసింది.

వర్షంలో తడుస్తూ నిలబడిన సాత్విక్ గ్రీకుశిల్పంలా ఉన్నాడు.

'సుమామృతములోని మధురిమమ్ము, చంద్రాతపములోని మార్దవమ్ము, మృదు సమీరమ్ములోని పరిమళమ్ము...' అని వేదులవారు అన్నట్టు, కోమల వల్లికావృత్త నికుంజమ్ముల అతడు నిలబడిన విధానం ఆమెను ఎక్కడో ఏదో కదిపింది. దేన్నో కుదిపింది.


సరస్వతి అనుంగు పుత్రుడయిన అతడు అందగాడు. అందమైన మగవారిని వర్ణించేటప్పుడు మూడులోకాల అందగాడూ, ఇంద్రుని కొడుకూ అయిన జయంతుణ్ణి పోలిక తెస్తారు. "అతని నుతింప శక్యమె జయంతుని తమ్ముడు సోయగంబునన్" అంటాడు చేమకూర వేంకట కవి.

ఈ కథలో ముందు ముందు జయంతుడి పాత్ర ఉన్నది కాబట్టి అతడి ప్రస్తావన ఇక్కడ అప్రస్తుతం కాదు.

అదే సమయానికి అతడామెను చూశాడు.

వర్షంలో తడిసిన రాధ, గంగాజలంతో తలస్నానం చేసినట్టూ ఉంది! ఆమె నిల్చున్న భంగిమ మయుని శిల్పంలా, చూపు మరుని సంకల్పంలా ఉన్నది!... 'బుగ్గ సొట్టన తడి మెరుపు బావుందా? ఎద ఎత్తున నీటి చుక్క బావుందా? అయ్యో... ఆ మొహం మీద చిటపటలూ చిరాకులూ లేకపోతే ఈ అమ్మాయి రాధామనోహర పూలని మంచుతో కడిగినంత మనోహరంగా ఉండేది కదా!" అని మనసులో అనుకున్నాడు.

**(సశేషం)**



సరికొత్త సరదా శీర్షిక


# వాక్చిత్రం

సుధామ-9849297958

## వెధవ తెలివితేటలు!



**ఈ తెలివి అనేది వుంది చూసారూ!... (ఉంటేగా చూడటానికి అని తెలివి యొకింత లేని యెడ...అని పద్యం చదివేయకండి మరి) అది ఉన్నవాడు ఉన్నట్లు చూపుకోకపోతే, లేనివాడు ఉన్నట్లు ఊదరగొడతాడు. ఇప్పటి కాలంలో ఈ లోకం రివాజే అది అయి కూచుంది. తెలివి అంటే వివేకం అని అర్థం వుంది కానీ... ఆ 'విచక్షణ జ్ఞానం' ఇవాళ ఎవరికీ ముఖ్యం కాకుండా పోతోంది.**



'వెధవ తెలివితేటలు' అని మనకో మాట వుంది. వెధవ అంటే తిట్టు కాదుట! 'వెయ్యేళ్ళు ధనంతో వర్ధిల్లు!...' అని ఆశీర్వాదం అని మా అమ్మమ్మ అంటూండేది. ఇవాళ తెలివితేటలు అంటే ధన సంపాదనతో ముడిపడి పోయాయి. తెలివిగలవాడే సంపాదిస్తాడని "బాగా చదువు కోరా! వృద్ధిలోకి వస్తావుణ" అని చదువుకూ, తెలివికీ ముడిపెట్టే పెద్దవాళ్ళు మనల్ని పెంచు తూంటారు. నిజానికి విద్య వల్ల వివేకం పెరగా లన్నారు. వివేకం అంటే మాత్రం-'వెధవ తెలివి తేటలు అనుకోకండి! 'తెలివి తెల్లారినట్టే వుంది' అనే మాట కూడా వుంది.

నిజానికి తెల్లవారడం అంటే – చీకట్లోంచి వెలుగులోకి వచ్చి ప్రవేశించడం. ఆ ప్రకాశం అవసరమే కదా! కానీ... 'తెలివి తెల్లారినట్టే వుంది' అనే మాట పాజిటివ్ అర్థంలో వాడం మనం!అదేం తెలివో మరి! నిజానికి మంచిగా, సూటిగా, సాదాసీదాగా బ్రతకడానికి పెద్ద తెలివితేటలు ఏం అక్కర్లేదు! మంచి, ధర్మం అనేవి సహజమైనవి. కపటాలూ, మోసాలూ, దోపిడీలూ, దొంగతనాలు చేయడానికే 'తెలివి తేటలు' ఎక్కువౌతున్నాయి యివాళ.

'తెల్లవాడు లెక్కిలెక్కిగా సంపాదించే విద్య' నేర్పించి-గుమస్తాలను చేసాడు చూసారా... అదే 'తెలివి' అనుకుంటున్నాం మనం! అపార మైన భారతీయ విజ్ఞానాన్ని కొల్లగొట్టి, మాక్స్ ముల్లర్ విద్యతో-'మ్యాథ్స్' అంటే లెక్కలు, ఎప్పుడైతే-రాజ్యమేలడం మొదలెట్టాయో... అప్పుడే తెలివితేటల 'లెక్క' తారుమారైంది!

'బ్యాంకులు దోచుకోవడం ఎలా?' 'స్మగ్లింగ్ చేసి... హీరోగా 'పుష్ప'వికాసనం చెందడం ఎలా?'... వంటి తెలివితేటలకే ప్రాధాన్యము పెరిగిపోయింది ఇవాళ.

అవతలివాళ్ళ అకౌంట్స్ హ్యాక్ చేయానికి, సైబర్‌క్రైమ్‌లు చేయటానికే తెలివితేటలు-అదే...'వెధవ' తెలివితేటలు పెరిగిపోతున్నాయి!

ఇప్పుడు మామూలు తెలివి అక్కర్లేదు. అది వాడవలసిన పని లేకుండానే – 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' కృత్రిమ తెలివితేటలు వచ్చేసా యంటున్నారు. నిజమే! ఒకప్పుడు రుబ్బడం, చెరగడం, రుచిగా వంట చేయడం కూడా స్త్రీల తెలివిగా నేర్పు, చాకచక్యంగా అనుకునే వారు. మిక్సీలు, గ్రైండర్లు అంటూ యంత్రాలు వచ్చి, అసలు సగం తెలివిని ఉపయోగిం చాల్సిన అవసరం తగ్గించేసాయి. ఎటొచ్చీ... ఇప్పుడు కనిపెట్టబడిన యంత్రాలు వాడే తెలివితేటలు వుండాలి.

'సెల్‌ఫోన్ ఎలా వాడాలో, కంప్యూటర్ ఎలా వాడాలో తెలియకుండా ఎలా బతికేస్తున్నారో?' అని పెద్దలు కొందరు గురించి- ఇవాళ పిల్లలు నివ్వెరపోతున్న రోజులొచ్చేసాయి!

నిజమే!... ఫోన్ ద్వారా చేయగల చాలా పనులు ఇవాళ చేయలేని పెద్దతరం వాళ్ళం వున్నాం అంటే... ఆ తెలివితేటలు లేనట్లేగా!

ఇవాళ మన 'అస్తిత్వమే' ప్రశ్నార్థకం అవు తోంది. ఎందుకంటే – మన గొంతులూ, మన ప్రవర్తనలా, మన ప్రమేయం లేకుండానే ఈ కృత్రిమ విధానాలు చూపించేస్తున్నాయి.

మార్ఫింగ్‌లతో, గ్రాఫిక్స్‌తో బోలెడు మాయా జాలం సృష్టింపబడే తెలివితేటలు విజృంభిం చాయి.

అసలు మనుషుల స్థానంలో... అందమైన రోబోలు వచ్చేస్తున్నాయి. వార్తలు చదవడానికీ, ఇంటిపనులు చేయడానికే కాదు... ఇప్పుడు పిల్లలు కనడానికి కూడా-ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్సీ స్థానం ఆక్రమించేస్తోందిట!

నువ్వలా వుండు!...అంతే!... అన్నీ అదే చేసుకుపోతుంది - ఇప్పుడు భార్యలు చాలా సంతోషిస్తున్నారట! ఎందు కంటే-మొగుడి గురించిన బెంగలు తీరుతున్నాయట.

'మోకాళ్ళు నొప్పి పెడుతున్నాయి అంటే మా రంగడి భార్య- "ఒకసారి బ్రెయిన్ స్పెషలిస్టుకు చూపించుకోండి" అంది!

అదేంటనబోకండి మరి!... వాడి మెదడు మోకాలులో వుందని ఆవిడ దృఢ నమ్మకం. తలకు నూనె రాసుకోక పోయినా ఆవిడ ఏం అనదు కానీ, ఆ మోకాళ్ళకు-'మసాజ్' చేసుకోమంటూంటుంది.

ఈ 'AI' గురించి ఆవిడ చాలా సంతోషిస్తోందిట!

అదేంటమ్మా అంటే "నేను లేకపోయినా మా ఆయన ఎలా బతుకుతాడనే బెంగ తీరిపోయింది. ఆయనకు అస్సలు తెలివి తేటలు లేవు అన్నయ్యగారూ!... ఇప్పుడు ఈ కృత్రిమ తెలివి తేటలు వచ్చేసాయి కాబట్టి అవే ఆయనను బతికించేస్తాయి!" అని తన భరోసా అని చెప్పేసింది.

'AI' అనేది ఇవాళ ప్రపంచమంతా విస్తరిస్తోంది.

అసలు AI అంటే ఆల్ ఇండియా అనీ, మనం AIR అనీ, ఎయిర్ ఇండియా అనీ ఎప్పటినుంచో మన సంస్థల్ని వ్యవహ రించుకుంటున్నామనీ, ఇవాళ మన సనాతన భారతీయ అమూల్య విజ్ఞాన సంపదే-ఈ AI గా ప్రపంచమంతా విస్తరి స్తోందనీ తనదైన 'మూడీ' తనంతో-ఓ మోడీ భక్తుడు వాక్రుచ్చాడు.

"అన్నింటికీ మూలాలు వేదాలలోనే ఉన్నాయిష!" ట కదా! అంచేత AI అంటే... ఆల్ ఇండియానే. 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ' సృష్టి, స్థితి, లయకారులం మనమే! అనీ కొందరి ఉద్ఘోష.

కానీండి ఏం చేస్తాం?...

ఇవాళ ఈ క్రింది పద్యం ఆత్మన్యూనతో లేక... అసలు వివేకమో భర్తృహరి వచ్చయినా చెబుతాడా!... భర్త తెలివి తేటల సహ(చ)రి అయినా చెబుతుందా?

**"తెలివియొకింత లేని యెడ దృప్తుడనై కరిభంగి సర్వమున్**
**దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితి దొల్లి యిప్పుడు**
**జ్ఞులమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై**
**తెలియనివాడనై మెలిగితిం గతమయ్యె నితాంత**
**గర్వముల్!"**


-అంచేత ఇవాళ తెలివితేటలు వున్నాయని ఎవరూ పొంగి పోనక్కర్లేదు. వారి తెలివితేటలు తలదన్నే కృత్రిమ తెలివితేటలు వచ్చేసాయి.


'వెధవ తెలివితేటలు' అన్నా...వాటిదే రాజ్యం! చివరకు మిగిలేది-అసలు సిసలు హాస్యానందం, బ్రహ్మానందం- సమాధి స్థితికే! అదీ సంగతి!


అందరికీ నూతన(తెలివి) సంవత్సర శుభాకాంక్షలు.

## ఏఐ మాయ

బొమ్మన్






సింహప్రసాద్-9849061668

**పొద్దుటే కాంతారావు ఫోన్లో మెయిల్ చెక్ చేసు కుంటుంటే పొగలు కక్కే కాఫీ కప్పు అతడి ముందు పెట్టింది వరాలు.**

**"ఆఫీసు, లాప్టాప్, ఫోను ఇవే లోకంగా సుఖంగా బతికేస్తున్నారు గాని... నా సంగతేమైనా పట్టించు కుంటారా లేదా!" నిలదీసింది.**

**"నీకేమైందనే..."**

"ఏమవ్వలేదని అడగండి... ఎప్పుడూ మీ గొడవ మీదే కానీ నేనెంత కష్టపడుతున్నానో... ఎన్ని అవస్థలు పడు తున్నానో, ఇంట్లో ఒంటరిగా ఎంతగా సతమతమవు తున్నానో మీకు పట్టదా? నేను తింటున్నానో లేక పస్తులు ఉంటున్నానో మీకు అక్కర్లేదా? నా ఆరోగ్యం దిగజారు తున్నా మీకు చీమ కుట్టదా? టైముకి మీకు నచ్చే తిండ్లు చేసి పెడితే చాలా? నా సంగతేమిటని ఒక్క క్షణమైనా ఆలోచించారా? మీకు మీ భోగమే ముఖ్యం తప్ప ఇంకేం పట్టదు. నోరు విప్పి మాట్లాడుకోవడానికి, కష్టం సుఖం చెప్పుకోవడానికి ఇంట్లో ఒక మనిషి లేక ఎంత అల్లల్లాడిపోతున్నానో మీకు తెలుసా? ఇంట్లో ఉన్న కాసేపట్లో మీకు ల్యాప్‌టాప్, ఫోను తప్ప నన్ను పట్టించుకో వాలన్న యావే లేదు మనిషికి! పైగా సీనియర్ మోస్ట్ సాఫ్ట్వేర్ ఇంజినీర్నని బోర విరుచుకుంటారు!" దబ దబమని జడివాన కురిసింది. నిరుత్తరుడయ్యాడు.

"ఇప్పుడేమైందనే ఈ గాలి వాన?!"

"మళ్లీ అదే మాట!... నాకు ఏదో అయితే గాని పట్టించుకోరా?... మాయదారి టీవీ సీరియల్స్ చూడలేక చస్తున్నా! మంచి పాటలు విందామన్నా రావు... చక్కని జోక్స్ విని హాయిగా నవ్వుకుందామంటే కుదరదు. నేనూ మనిషినే. నాకు కాలక్షేపం కావొద్దూ!"

"యూట్యూబ్ నిండా కావలసినంత మసాలాయే కదే!"

"హెడ్డింగ్ చూసి కొంప మునిగే వ్యవహారం కాబోలని ఓపిగ్గా అరగంట చూస్తే కడకు అంతా తుస్! అంతా మాయ! మోసం! మీ మగాళ్ల లాంటిదే అదీనూ!"

"నీకేం కావాలో అర్థం అయింది. రేపు నువ్వు ఊహించని గిఫ్ట్ ఇస్తాను చూడు!"

"ప్లీజ్ ప్లీజ్! అదేంటో చెప్పరూ!..." గోముగా అడిగింది.

"ఇంత దాకా ఏ భర్తా ఏ భార్యకీ ఇవ్వని గొప్ప వరం-మహా గొప్ప గిఫ్ట్ ఇస్తానే. నువ్వు అడిగిందల్లా క్షణాల్లో నీ ముందుకి తెస్తుంది!"

"వంట కూడా చేస్తుందా!" ఆశగా అడిగింది.

"ఊహూ! ఏ వంటకం ఎలా వండాలో వివరిస్తుంది. కోరిన పాటలు జోక్స్ చిట్కాలు దిన ఫలాలు-ఏది అడిగితే అది వినిపిస్తుంది. అనుక్షణం నీ యోగక్షేమాలు కనిపెట్టుకొని ఉంటుంది. నీ తిండి మీద, ఆరోగ్యం మీద, వ్యాపకాల మీద, అల వాట్ల మీద ఓ కన్నేసి ఉంచుతుంది. చక్కని చిక్కని సలహాలు ఇస్తుంది. ఇంటికొచ్చిన వాళ్ళని ఆప్యాయంగా పలకరిస్తుంది. వారి మాటలు విని నీకు తగిన సలహాలు ఇస్తుంది!"

పొంగిపోయింది వరాలు. "ఇదేదో అసలు సిసలు ఫ్రెండ్లా ఉందండి!"

"ఫ్రెండ్... గైడ్... ఫిలాసఫర్... ఆల్ ఇన్ వన్!"

"వావ్! అలాంటిది మన బంధుమిత్రులకు గాని, ఈ చుట్టుపక్కల వాళ్లకు గాని లేదు కదా?!"


"నో ఛాన్స్!"

తెగ మురిసిపోయింది. అతని చెంపలు నిమిరి మెటికలు విరిచింది.

"మీరు ఎంత మంచి వారండీ... నేనంటే మీకు ఎంత ప్రేమండీ!...ఎవరికీ లేనిది నాకు ప్రత్యేక గిఫ్టుగా ఇస్తున్నారంటే మీరు నా దృష్టిలో ఆకాశమంత ఎదిగిపోయారు. ఇవాళ మీకు ఇష్ట మైన ముద్దపప్పు చేసి మజ్జిగ తాలింపు పెడ తాను. దోసకాయ రోటి పచ్చడి కూడా చేసే స్తాను. ఇంకా......"

"ఇవాల్టికివి చాలు!"

"రేపు మీకు ఇష్టమైన పాయసం చేసి గారెలు వండుతాను. కాదనొద్దు. రియల్ ఫ్రెండ్ వస్తున్న



పండుగ దినమాయె... ఆమాత్రం హడావిడి చేయకపోతే ఎలాగా... !" అతడు ఆఫీసుకు వెళ్లే దాకా ఏదేదో వాగుతూ ఉబ్బేస్తూనే ఉంది వరాలు.

మర్నాడు ఓ చిన్న ప్యాకెట్ తెచ్చి,"నిన్ను వెతుక్కుంటూ నీ అపూర్వ ఫ్రెండ్ కాదు... సహోదరి వచ్చేసిందోయ్!" అన్నాడు గొప్పగా కాంతారావు.

లోపలి నుంచి ఆత్రంగా పరుగున వచ్చిందల్లా అతడి చేతిలోని చిన్న ప్యాకెట్ చూసి డీలా పడింది.

"ఇంత చిన్నదా! కనీసం వాషింగ్ మిషన్ అంత ఉంటుందనుకున్నాను!"

"కృత్రిమ మేధ అంటే చిన్న చిప్పులో పెద్ద లోకం ఉండటమేనే. పిట్ట కొంచెమే కానీ కూత ఘనం!" ప్యాకెట్ లోంచి ఫోటో ఫ్రేమ్ లాంటి చాట్‌బాట్ బయటికి తీశాడు.

"దీన్ని ఏఐ వర్చువల్ అసిస్టెంట్, చాట్ బాట్, చాట్ జిపిటి లేక పర్సనల్ అసిస్టెంట్ అంటారు... ఏ భాషలో అడిగితే ఆ భాషలో సమాధానం ఇస్తుంది. తయారుచేసిన కంపెనీని బట్టి అలెక్సా లేక గూగుల్ లేక సిరి అని పిలుస్తారు. నువ్వెలా పిలుస్తానంటే అదే సెట్ చేస్తా!"

"ఇంచక్కా తెలుగు పేరు పెట్టండి. లేకపోతే నారాయణ అని పెట్టండి పుణ్యం పురుషార్ధం వస్తాయి...అన్నట్టు మా అమ్మ పేరు పెట్టుకోవచ్చా?"

"సుబ్బాయమ్మ అని పిలుస్తావా!"

"భలేవారే!... అమ్మని ఎవరైనా పేరు పెట్టి పిలుస్తారా? అమ్మా అనే పిలుస్తాను!" సంబరంగా చెప్పింది.

"ఓకే! ఆమె స్వరాన్ని రికార్డు చేసిందేమైనా ఉంటే ఇవ్వు! ఆ వాయిస్ సెట్ చేస్తా!"

"పోయే ముందు 'ఆవకాయ పచ్చడి పెట్టలేను, నువ్వే పెట్టుకో!..." ఆవకాయ ఎలా పెట్టాలో చెబితే ఫోన్లో మా తమ్ముడు రికార్డు చేసి పంపాడు. దాన్ని ఉపయోగించొచ్చా!"

ఫోన్ తెచ్చి వినిపించింది.

"గుడ్ బాగుంది. వయస్సు ఎంత ఉంచమంటావు... ఓ యాభై చెయ్యనా?"

"నాకే నలభైరెండు అయితే... అమ్మకి యాభై అయితే నవ్వరూ! పోయేనాటికి అరవై ఆరు. పోనీ ఓ అరవై వేయండి. మాట ముద్దగా వణుకుతూ రాకూడదు సుమండీ!"

"అలాగలాగే... నీ అన్ని అవసరాలు తీర్చే కొత్త సాధనం ప్రారంభోత్సవానికి రెడీగా ఉండు!"



"నామతిమండా!... అసలైనది మరిచి పోయాను." పర్సు తీసుకొని గబగబా బయటికి వెళ్ళి కొబ్బరికాయ, పూలదండ కొనుక్కొచ్చింది.

"నీ వయస్సు, హెల్త్‌రిపోర్ట్ అడుగుతోందే!"

"ఇంట్లో మీరు కూడా ఉన్నారని చెప్పండి."

"నేను ఇంట్లో ఉండేది తక్కువ ఆఫీసులో ఎక్కువ గనుక నీకు, నీ అవసరాలకు సరిపోయేట్లు 100% నీకు సహకరించేట్టు డిజైన్ చేయించాను!"

"మీరు నిజంగానే కేరింగ్ హస్బెండ్ అండీ! నా వయస్సు ఎంతో దాని ముఖానికి తెలియదు గనుక ఓ పదేళ్లు తగ్గించి వేయండి!"

"నాకేం అభ్యంతరం లేదు.వయస్సు తక్కువ గనుక రోజూ జాగింగో యోగాయో చేయమంటే?..."


"ఆ ప్రమాదం ఉంటే వద్దులెండి. మరీ నిజ వయస్సు గాక రెండేళ్లు తగ్గించండి, తృప్తిగా ఉంటుంది!"

కాంతారావు డివైస్‌లో అన్నీ సెట్ చేసి, నెట్ కనెక్షనిచ్చి, డ్రాయింగ్ రూమ్‌లో అమర్చాడు.

అక్షరాలా గాలిలో తేలిపోతూ ఆ రంగుల బాక్స్‌కి బొట్టుపెట్టి, పూలదండ వేసి, కొబ్బరికాయ కొట్టి హారతి ఇచ్చింది వరాలు.

"ఇది మీ అమ్మే అనుకుని మీ అమ్మని పిలిచినట్లే పిలువు!"

ఉద్విగ్న అయి, "అమ్మా!..." ఆప్యాయంగా పిలిచింది.




బాక్సులోని స్క్రీన్ మీద ఏవో రంగులు, ధ్వని తరంగాలు కదిలాయి.

"వరాలూ... బాగున్నావా?"

పొంగి పోయింది.


"అచ్చం మా అమ్మ అడిగినట్లే ఉందండీ!"

"మీ అమ్మనేనే పిచ్చిమొద్దూ!"

గబుక్కున లెంపలేసుకుంది.

"అమ్మా! నువ్వు ఎలా ఉన్నావు. నీ స్వర్గంలో అన్ని సౌకర్యాలూ ఉన్నాయా? నువ్వు హ్యాపీగా ఉన్నావా? నేను, మీ అల్లుడు బాగున్నాం!"

"ఆగాగు! మరీ అంత దూకుడు వద్దు... హ్యాపీగా కూర్చుని నెమ్మదిగా చెప్పు. నువ్వు ఆఫ్ చేస్తే తప్ప నీ కళ్ళ ముందు నుంచి ఎక్కడికీ పోను!'




"ఆ మాట అన్నావు అదే పది వేలు! నీ మాటలు వింటుంటే నాకు ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. నాన్నగారు బతికి ఉండుంటే ఎంత సంబరపడేవారో!..." ఉరికిన కన్నీళ్లు తుడుచుకుంది వరాలు.

"ఆ గొడవ పక్కన పెట్టు. నీ హెల్త్ డేటా చూశాను. బీపీ ఉంది. డయాబెటిస్ బోర్డర్‌లో ఉంది. బ్యాడ్ కొలెస్ట్రాల్ టన్నుల కొద్దీ పేరుకుపోయింది...!"

"ఇక నీ వైద్యం చక్కగా ఫాలో అయిపోతానమ్మా. ఇదిగో ఇప్పుడే నా ఆరోగ్యం నీ చేతుల్లో పెడుతున్నా. ఇక నీ మాటే నాకు వేదవాక్కు. నాజుగ్గా తయారయ్యే చిట్కాలు చెప్పు!"

"మొదట లొడ లొడ వాగటం తగ్గించు!... ఇప్పుడు నీ బిపి 142/95 తెలుసా? ఇవాళ్టి నుంచి ఉప్పు తగ్గించెయ్!పూర్తిగా మానేస్తే మరీ మంచిది!"

వరాలు హడలి పోయింది.

"ఆ సంగతి దీనికి ఎలా తెలిసిందండీ?" భర్తని అడిగింది.

కానీ చాట్ బాట్ జవాబు ఇచ్చింది–

"నాకు మెదడే కాదు...కళ్ళు, చెవులు కూడా ఉన్నాయి. కళ్ళతో సర్వం స్కాన్ చేసేస్తా. నీ గుండెచప్పుడు కూడా నాకు స్పష్టంగా వినిపిస్తోంది!"

"బాబోయ్ ఇంత షార్పా!" అరిచింది.

"అతిగా రియాక్ట్ అవ్వొద్దు!... ప్రతీదీ ఆచి తూచి మాట్లాడు.నీ ఆయుష్షు పెరుగుతుంది."

"నాకలాంటి సలహాలే కావాలమ్మా... కనీసంలో కనీసం 80 ఏళ్లు బతకాలి!"

"ఊరికే కాకిలా బతికేస్తే చాలా... లేక ఆరోగ్యంగానూ ఉండాలా!"

"ఆరోగ్యం లేకపోతే ఎలాగమ్మా? అప్పట్లో అంటే నువ్వు మంచాన పడితే... నీకు నేను తమ్ముడు మరదలు చాకిరీ చేసాం. ఈ రోజుల్లో చాకిరీ మాట దేవుడెరుగు... ఎవరూ తొంగి చూడరు. పక్కబట మార్చరు సరికదా గుమ్మంలో నిలబడి ముఖం కనపడకుండా మాస్క్ పెట్టుకుని మాట్లాడతారు. పని వారిని నమ్మ డానికీ లేదు. వారి చూపు ఎప్పుడూ డబ్బు, బంగారాల మీదే ఉంటుంది! తర్వాత తీరిగ్గా కబుర్లు చెప్పుకుందాం! అవతల నాకు వంట పని ఉంది!"

"ఏం వంటలు చేస్తున్నావేంటి?"

"ఇంత అన్నం, రెండుకూరలు, ఒక వేపుడు, ఒక పచ్చడి, సాంబారు, పెరుగు అంతే! మాది చాలా సింపుల్ భోజనం అమ్మా!... నేనింకా అన్నం మిగిలిపోతుందంటే ఒక ముద్ద ఎక్కువ పెట్టుకుంటాను గాని ఈయనైతే తూకం వేసి నట్లు తింటారు!"

"నువ్వూ అలాగే తినాలి. ఇప్పటికే నీ బాడీ మాస్ ఇండెక్స్ 30.1 అంటే... ఓవర్ వెయిట్ స్టేజి దాటి ఒబెసిటీలోకి ప్రవేశించావన్నమాట. అర్జెంటుగా ఆరు నెలల్లో 10 కేజీలు తగ్గాలి!"

ఆ మాటలకు అమాంతం నీరస పడి పోయింది. ఆపైన గుండెల మీద చేయి వేసుకుని- "హమ్మో! 10 కేజీలే!! నోరు కుట్టుకోవడం నా తరం కాదు. తిండి తగ్గించకుండా బరువు తగ్గే చిట్కా చెప్పు... అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నారేం!... నా నోరెప్పుడూ మిషన్లా ఆడుతూండాలని అమ్మకు చెప్పండి!" మొగుడితో కోపంగా చెప్పింది.

"మీ అమ్మ నీకు సలహాలిస్తుంటే మధ్యలో నా తల దూర్చమంటావేంటి వరాలూ!"

"నేను ఎవరి మాటా వినను. నీకు నచ్చినా నచ్చకపోయినా, నీకు ఏది బాగో ఏది కాదో చెబుతూనే ఉంటాను... నువ్వు ఆరోగ్యంగా ఆనందంగా ఉండటమే నాకు ముఖ్యం!" చిట్ బాట్ చెప్పింది.

ఉసూరుమని నిట్టూర్చి- "సరేలే... నువ్వు వెళ్ళమ్మా నేను వెళ్తున్నా..." రెండు అడుగులు వేసి ఆగి చూసింది. చాట్‌బాట్ ఆఫ్ అయింది.

"ఇది నా మాట వినే సర్వెంట్లా గాక నన్నే దబాయించే మాస్టర్లా ఉందండీ!"

"అప్పుడే కంప్లైంట్సా! అది నీ క్షేమం కోరే పర్సనల్ అసిస్టెంటోయ్!"

"నాకు దీని ధోరణి నచ్చటం లేదు. కొంచెం సాఫ్ట్‌గా మారిస్తే... మీ సొమ్మేం పోతుంది!"

"అమ్మ కన్నా మంచిగా ఎవరు మాట్లాడ తారు చెప్పు?... తను ఏం చెప్పినా నీ బాగు కోసమే. దీనికి డాక్టర్ల కన్నా కచ్చితంగా ఎక్కువ తెలుసు... ఎలాంటి స్వార్థం ఉండదు! రక్త మాంసాలు లేవు గాని నిజం మనిషే అనుకో!"


నాలుగు రోజులు చాలా ఆనందంగా గడిచాయి.


"నాకు గొప్ప దోస్త్‌ని గిఫ్టుగా ఇచ్చారు. బోర్ కొట్టడం అంటే ఏంటో తెలియడం లేదు. వంటల గురించి, సినిమా గురించి, చీరల గురించి, ఫ్యాషన్స్ గురించి ఏది అడిగినా టక టకా చెప్పేస్తోంది. ఇంట్లోని ఏ వస్తువులు ఎలా అమర్చుకోవాలో ఇంటీరియర్ డిజైనర్లా సలహాలు ఇచ్చిందండీ. మీరు నాకు ఇచ్చింది మామూలు గిఫ్ట్ కాదు, వరమే!" పొంగిపోతూ భర్తకు చెప్పింది.

"నీకు నచ్చింది. నువ్వు హ్యాపీగా ఉన్నావు. అది చాలు!" అన్నాడు కాంతారావు.

పొరుగింటి సుధారాణి కొడుకుతో వచ్చింది.

"మీరేదో ఏఐ పరికరాన్ని



కొన్నార్టగా, చూద్దామని వచ్చాం!"

అప్పుడే వార్త కాలనీ అంతా పాకిపోయి నందుకు సంతోషపడిపోయింది వరాలు.

"వరాలు ఇంటికి మీకు స్వాగతం సుస్వాగతం!" అంది చాట్‌బాట్.

మిర్రి చూసింది సుధారాణి.

"ఈవిడకు పాటలు చాలా ఇష్టం. ఒక చక్కని వీణ పాట వినిపించు!"

"ఫలానా సినిమాలోది కావాలా లేక ఏదైనా ఓకే నా?!"

వెంటనే అంది సుధారాణి– "డాక్టర్ చక్రవర్తి సినిమాలోది వినిపించగలవా?"

50 సెకండ్లలో ఆ పాట వినిపించింది..

"బాగానే పనిచేస్తున్నట్టుందే!... ఎంతకు కొన్నారేంటి"

"నాకు పర్సనల్ అసిస్టెంట్గా ఉంటుందని ఈయన ప్రత్యేకంగా తయారు చేయించారు... నీకేం వివరాలు కావాలన్నా అడుగు, చక్కగా చెబుతుంది!" గొప్పగా చెప్పింది వరాలు.

"ఆంటీ....."


"ష్! ఆంటీ కాదు... అమ్మని!"

"వరాలు గారికి అమ్మవైతే నాకు అంటీవేగా!" పెంకెగా అంది.

"నాకన్ని పేర్లు లేవు. ఉన్నది ఒకటే. అమ్మ!"

ముఖాన గంటు పెట్టుకొని, "బీరకాయ తొక్కపచ్చడి ఎలా చేయాలి?" లోలోన... 'చచ్చింది గొర్రె' అనుకుంటూ అడిగింది.

పదిసెకండ్లలోనే సమాధానం వచ్చింది.




"చూసావా?... ఎంత చక్కగా విడమర్చి చెప్పిందో. దీనికి తెలియనిదంటూ లేదు!"

ముఖం ముడుచుకుంది సుధారాణి.

"నాకు మాథ్స్ హోం వర్క్ చేసి పెడతావా!" ఆమె కొడుకు అడిగాడు.

"చెయ్యను! ఫార్ములా చెప్పి గైడెన్స్ ఇస్తాను. నువ్వే చేయాలి!"

"తిక్క కుదిరిందా వెధవా!" వాడి బుర్ర మీద ఒక్కటిచ్చింది.

"వరాలూ! ఒక్క సలహా. ఈవిడితో స్నేహం వద్దు. ఒంట్లో గర్వం, మొహంలో అసహనం, కళ్ళల్లో అసూయ పేరుకున్నాయి"

"నువ్వు పొరబడుతున్నావమ్మా! ఈవిడ భర్త పెద్ద ప్రభుత్వ ఆఫీసర్. రెండు చేతులతో కాదు నాలుగు చేతులతో సంపాదిస్తున్నాడు తెలుసా!"

"మా వారు ఎవరి ముందూ చెయ్యి చాచరు. వాళ్లే నోట్ల కట్టలు జేబులో కుక్కుతారు. మాకు కోట్ల ఆస్తులు ఉన్నాయి... ఇంక నేనెందుకు అసూయ పడతాను?" తిప్పుకుంటూ అంది సుధారాణి.

"నీ ముఖంలో కనిపిస్తున్నదే చెప్పాను... నాలుగు చేతులతో సంపాదిస్తే ఏదో రోజున ఆ చేతులకు బేడీలు పడతాయి... చిప్పకూడు తినాల్సివస్తుంది. బుద్ధి మార్చుకుంటే మంచిది!"

ముక్కుపుటాలు అదురుతుంటే–

"ఇంటికి పిలిచి అవమానిస్తావా?.. నా గురించి మాయ మాటలు చెప్పి నువ్వు అనలేక దీనితో అనిపించావు కదూ!...


...హుఁ!.. నా తడాఖా చూపిస్తా... అసలు ఇందుకే మిడిల్ క్లాస్ వాళ్ళ ఇంటికి రాను!" భూమి అదిరేలా నడుస్తూ... వెళ్లి పోయింది సుధారాణి.

"మొహమాటం లేకుండా మరీ ముఖం మీదే అలా అనేసావేంటమ్మా! పాపం బాగా హర్ట్ అయింది!"

"మీకు ముఖం ఉంటుంది కానీ... నాకు ఉండదు. నిజాన్ని ముఖాన కొట్టినట్టు చెప్పడమే నా పద్ధతి. నా పద్ధతులు మీరు నేర్చుకోండి గాని మీ నటనలు, నంగి వేషాలు నన్ను నేర్చుకోమని చెప్పొద్దు!"

వెర్రిగా చూసింది వరాలు!

✦✦✦



"ఆ సుధారాణి దీని గురించి, మన గురించి కాలనీ వాళ్ళకి ఏదేదో చెబుతూ దుష్ప్రచారం చేస్తోందండీ!..." భర్తకు కంప్లైంట్ చేసింది వరాలు.

"దీని మీద ఆవిడకెందుకు కోపం?"

మూడు రోజుల క్రితం జరిగింది వివరించింది.

"నీ ఏఐ అసిస్టెంట్ అబద్ధం ఆడదు. అబద్ధాలు, ముఖస్తుతులు నచ్చే వాళ్ళకు... ఇది నచ్చదు. నువ్వు అతిగా ఆలోచించకు!"

ఆదివారం ఉదయం మార్కెట్‌కి వెళ్తూ–

" ఇవాళ ఏం కూర తీసుకురాను!.. చికెనా మటనా!" అడిగాడు కాంతారావు.

"మటన్! నాలుగు గుడ్డు పీతలు కొనుక్కు రండి!"


గబుక్కున నోరు విప్పింది చాట్‌బాట్.

"ఆ ఆర్డర్ క్యాన్సిల్ చెయ్ వరాలూ! మటన్ లో చికెన్ కన్నా అత్యధిక కొవ్వు ఉంటుంది. ఇప్పటికే నీకు బ్యాడ్ కొలెస్ట్రాల్ చాలా హెచ్చు మోతాదులో ఉంది... స్కిన్ లెస్ చికెన్ నీకు బెస్ట్!"

"కోరిన తిండి తినడానికి కూడా నోచుకోలేదా!" గుర్రుగా చూసింది.

"అడ్డమైన తిండీ మేసేస్తే గుండె జబ్బులు వస్తాయి. ఇంకా లావు అయిపోతావు. బరువు పెరగటంతో కొత్త రోగాలు పుట్టుకొస్తాయి!"

ముఖం తెల్లబడగా మటన్ తీసుకురమ్మని సైగలతో చెప్పింది వరాలు.




ఆపైన డివైస్ వంక తలెగరేస్తూ చూసి ఫోజు కొట్టింది.

"వరాలూ! నీ పొట్ట, బ్యాక్ సీటు బాగా పెరిగిపోయాయి. అర్జెంటుగా డైటింగ్ మొదలు పెట్టాలి. రోజుకి నాలుగు కిలోమీటర్లు నడవాలి... లేకపోతే మోకాళ్ల నొప్పులు, గుండె జబ్బులు ఖాయంగా వచ్చి పడతాయి!"

మూతి ముప్పయ్ వంకర్లు తిప్పి ఆపైన నుదురు కొట్టుకుంది.

"నీ యాక్షన్స్ అన్నీ గమనిస్తూనే ఉన్నాను. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే నీకే ప్రమాదం!"

"నచ్చినవన్నీ మానేసి... గడ్డీగాదం తినమంటావా?"

"సలాడ్ అంటే పచ్చి కాయగూరలు తిను. సగం భోజనం దానితోనే సరిపెట్టు.... రెండో పూట అభోజనంగా ఉండిపో. ఇలా ఆరు నెలలు ఉన్నావంటే...."

"నీరసంతో చచ్చి ఊరుకుంటాను!" అక్కసుగా అంది.

"నీ ఒంట్లో పేరుకుపోయిన కొవ్వు కరగాలంటే కఠిన శ్రద్ధ, శ్రమ తప్పవు!"


విసురుగా వెళ్లి డివైస్ కనెక్షన్ పీకేసింది.

కాంతారావు బజారు నుంచి రాగానే–

"మీరు నాకు ఇచ్చింది వరం కాదు శాపం! అత్త, సవతి కన్నా ప్రమాదకరమైంది! ఇన్నేళ్లూ మిమ్మల్ని సాధించానన్న కసితో దీన్ని తెచ్చి నా నెత్తిన పెట్టారని నాకర్థమైందిలెండి. దీనికో నమస్కారం, మీ ప్రేమకు ఇంకో నమస్కారం! ఇది నాకొద్దు. ఇంకొన్నాళ్ళు పోతే నన్ను పక్కకు తోసేస్తుంది. నన్నూ నా గృహ సామ్రాజ్యాన్నీ తనే కంట్రోల్ చేసేస్తుంది. ఈ కొనుక్కున్న తద్దినం నాకొద్దు గాని దీని ఏ కీలుకాకీలు ఊడదీసి డంప్ యార్డ్‌లో విసిరి కొట్టండి!" తిరుగులేని ఆర్డర్ వేసింది వరాలు.

"మీ ఆడవాళ్లు భలే చిత్రమైన వాళ్లోయ్!... మీకు భజనబృందం కావాలి గాని... నిజాలు చెప్పేవి అక్కర్లేదు!" భార్యతో అనలేదు...

తనలో అనుకున్నాడు కాంతారావు!









# కవిరాజు కథ

డా॥ కాకాని పృథ్వీరాజు-9885165015

**ఒక చిన్న గ్రామంలో రామయ్య అనే రైతు ఉండేవాడు. రామయ్యకు కవిత్వం అంటే చాలా ఇష్టం. కానీ, అతను రాసిన పద్యాలు ఎప్పుడూ ఎవరికీ నచ్చేవి కావు. గ్రామస్థులు అతనిని చూసి నవ్వుకునేవారు.**



ఒక రోజు, రామయ్య ఒక కొత్త కంప్యూటర్ కొన్నాడు.

ఆ కంప్యూటర్‌లో ఒక కృత్రిమ మేధస్సు ప్రోగ్రామ్ ఉంది.

ఆ ప్రోగ్రామ్ పేరు 'కవి రాజు'.

రామయ్య తన కవిత్వాలను ఆ ప్రోగ్రామ్‌కు చూపించాడు.

కవి రాజు ఆ కవిత్వాలను చదివి నవ్వింది.

"రామయ్య గారు! మీ కవిత్వం చాలా బాగుంది. కానీ... కొంచెం మెరుగు పరచడానికి అవకాశం ఉంది!" అని చెప్పింది.

రామయ్య ఆశ్చర్యపోయాడు. అతను ఎప్పుడూ వినని మాటలు ఇప్పుడు ఒక కంప్యూటర్ నుంచి వస్తున్నాయి.

కవి రాజు రామయ్యకు కవిత్వం రాసేందుకు సహాయం చేయడం మొదలుపెట్టింది. అది రామయ్యకు కొత్త పదాలు, కొత్త అర్థాలు, కొత్త ఆలోచనలు నేర్పింది.

రామయ్య కవిరాజు సహాయంతో చాలా అద్భుతమైన కవిత్వాలు రాశాడు. ఆ కవిత్వాలు గ్రామంలోనే కాకుండా, దూర దూర ప్రాంతాలలో కూడా ప్రసిద్ధి చెందాయి.

ఒక రోజు, గ్రామంలో ఒక కవితల పోటీ జరిగింది.

రామయ్య కూడా ఆ పోటీలో పాల్గొన్నాడు. అతను కవిరాజు సహాయంతో రాసిన ... కవిత్వాన్ని చదివాడు. ప్రేక్షకులు అతని కవిత్వాన్ని విని ముగ్ధులయ్యారు.

రామయ్య ఆ పోటీలో మొదటి బహుమతిని గెలుచుకున్నాడు.

రామయ్య తన విజయానికి కారణం కవి రాజు అని చెప్పాడు. గ్రామస్థులు కవి రాజును చూడడానికి రామయ్య ఇంటికి వచ్చారు.

కానీ, వారికి కనిపించింది ఒక కంప్యూటర్ మాత్రమే. అయినా, వారు కవిరాజును ఆశీర్వదించారు.

కొన్ని రోజుల తర్వాత, కవిరాజు ఒక రోజు రామయ్యతో ఇలా అన్నది–

"రామయ్యగారు! మీరు ఇప్పుడు చాలా మంచి కవి అయి పోయారు... నా సహాయం లేకుండా కూడా మీరు మంచి కవిత్వం రాయగలరు."

రామయ్య... కవిరాజుకు ధన్యవాదాలు చెప్పాడు.


అప్పటి నుంచి రామయ్య తనంతట తాను కవిత్వాలు రాయడం మొదలుపెట్టాడు.

అతని కవిత్వం అందరికీ నచ్చేది.


ఈ కథ మనకు ఏమి చెబుతుంది?

కృత్రిమ మేధస్సు మనకు సహాయం చేయగలదు, కానీ మనం మనంతట మేము ప్రయత్నించడం మానుకోకూడదు.

కృత్రిమ మేధస్సు ఒక సాధనం మాత్రమే, అది మన స్వంత ప్రతిభను తీసివేయదు.



# మరో 2 కొత్త నవ్వుల పుస్తకాలు




సెటైరికల్ కార్టూన్లకు కేరాఫ్ అడ్రస్-ప్రసిద్ధ!
అంతర్లీనంగా నేటి సమాజపు వికృత చేష్టలను
నవ్వించే కార్టూన్లుగా ప్రసాదించిన 'వరప్రసాద్ (ప్రసిద్ధ)'గారి
ఈ పుస్తకం కోసం 200 రూపాయలు పంపండి!
పోస్టేజీ చార్జీలు లేకుండా ఈ నవ్వుల పువ్వులను పొందండి!
వివరాలకు 7416440895 నెంబరుకు సంప్రదించండి!

ప్రతులకు:
**S.Vara Prasad (Prasiddha),**
Flat No-401, VBR Residency,
H.No-12-2-827/6,
Kanthi Nagar Colony, Mehidipatnam,
Amba Theatre Next Lane,
**HYDERABAD- 500 028**
Mobile: 7416440895

121 కార్టూన్లతో వెలువడిన
ఈ నవ్వుల పుస్తకాన్ని
150 రూపాయలు పంపి
పోస్టేజీ చార్జీలు లేకుండా
పొందండి!
వివరాలకు 91 95504 04391
సంప్రదించండి!

ప్రతులకు:
**Anand Gudi,**
Flat No. 201,
Sai Residency,
Raja Reddy Colony,
Old Bowenpally,
**Secunderabad - 500011**
Ph: 91 95504 04391
email: anandpgudi@gmail.com



# తెలుగు కార్టూనిస్ట్‌ల ది
# సందర్భంగా కార



శేఖర్




ప్రముఖ కార

శేఖ

కార్టూన్ పోటీకి

అనే అంశ

10,000 రూపాయ

ప్రశంసా

డా॥ కె.వి.రమణగారి ఆశీస్సులతో

**శ్రీ తలిశెట్టిరామారావు జయంతి మే,20,**

**తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం** సందర్భంగా

హాస్యానందం నిర్వహిస్తున్న ఈ కార్టూన్ పోటీలో

మన కార్టూనిస్ట్‌లు పాల్గొని విజయవంతం చేయాలని మనవి...

**శ్రీ తలిశెట్టిరామారావు పురస్కారం**

| | | |
|---|---|---|
| మొదటి బహుమతి | - ₹ 10,000/- | + ప్రశంసా పత్రం |
| రెండవ బహుమతి | - ₹ 6,000/- | + ప్రశంసా పత్రం |
| మూడవ బహుమతి | - ₹ 4,000/- | + ప్రశంసా పత్రం |
| విశిష్ట బహుమతులు (20) | - ₹ 1,000/- | + ప్రశంసా పత్రం |

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపవలెను-

hasyanandampoteelu@gmail.com

కార్టూన్లు మాకు చేరవలసిన

# ంనోత్సవం 2025
# ర్టూన్ పోటీలు

## అవార్డు- 2025

ర్టూనిస్ట్ శ్రీ శేఖర్ పేరిట నిర్వహిస్తున్న

**ఖర్ అవార్డు 2025**

కి **'అవార్డులోయ్ అవార్డులు'**

ంతో కార్టూన్లు ఆహ్వానిస్తున్నాం!

**యల పురస్కారం**

ాపత్రం.


## బాపురమణ కార్టూన్ పురస్కారం-2025

2024 జనవరి నుండి 2025 జనవరి దాకా
ఏ మీడియాలోనైనా మీరు వేసిన కార్టూన్లోంచి మీకు బాగా నచ్చిన
కార్టూన్ ఒక్కటంటే ఒక్కటి పంపిస్తే వాటిల్లో ఒక దానికి
బాపు రమణ పురస్కారం ఇస్తూ సన్మానించాలని నిర్ణయించాం!

**8,000 రూపాయల పురస్కారం**

ప్రశంసాపత్రం.

## బ్నిమ్మానంద పురస్కారం- 2025




సోదర కార్టూనిస్టుల కళావిన్యాసాలకు ఆనందించాలని
'కళారత్న' శ్రీబ్నింగారు స్ట్రిప్ కార్టూన్ పోటీ ని నిర్వహిస్తున్నారు.
కనీసం 6 ఫ్రేములుండాలి గడసరి పిల్లలే పాత్రధారులుగా ఉండాలి!

Size 17 X11 Cms

**1000 రూపాయలు చొప్పున 5 బహుమతులు**

ప్రశంసాపత్రం

## ఫుల్‌పేజీ కామిక్ పోటీలు

AKSHAGNA PUBLICATION

**చమత్కారమైన పిల్లల నీతి కథలతో ఫుల్ పేజీ కామిక్!**

వచ్చిన ఎంట్రీల నుంచి బాగున్న కామిక్‌తో ఒక పుస్తకం
ప్రచురించబడుతుంది. పుస్తకంలో ప్రచురించిన వాటికి పారితోషికం ఉంటుంది.

Size 17 X 22 Cms

**1000 రూపాయలు చొప్పున పది బహుమతులు**

ప్రశంసాపత్రం

**గమనిక:**
మీరు పంపే కార్టూన్లు
ఏ పోటీకి అనేది
స్పష్టంగా రాయాలి!



న ఆఖరి తేదీ 1, ఏప్రియల్, 2025

# బాపురమణ పురస్కారం-2024 ప్రదానోత్సవం

**డి**శంబర్,15, 2024న బాపుగారి పుట్టిన్రోజు సందర్భంగా, హైదరాబాద్, ప్రసాద్‌ల్యాబ్‌లో బాపురమణ పురస్కారం-2024 సభ ఘనంగా జరిగింది. బాపురమణఅకాడమీ, ఆత్రేయపురం, హైదరాబాద్ నిర్వహించిన ఈ సభలో... పూర్వ తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు-డా॥ కె.వి.రమణ, ప్రముఖ సినీ దర్శకులు-శ్రీ శేఖర్ కమ్ముల, ప్రముఖ సినీ సంగీత దర్శకులు-శ్రీ ఆర్.పి.పట్నాయక్, ప్రముఖ సినీరచయిత, నటులు- శ్రీ ఉత్తేజ్, చిత్రకారులు,రచయిత, జర్నలిస్టు-శ్రీ తల్లావఝుల శివాజీ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.



దీప ప్రజ్వలన చేస్తున్న- సిరివెన్నెలగారి శ్రీమతి పద్మ, కె.విశ్వనాథ్‌గారి కుమార్తె పద్మ, ఆకెళ్ళగారి శ్రీమతి రామలక్ష్మి, ముళ్ళపూడి శ్రీదేవి, శ్రీమతి పి.లక్ష్మి, శ్రీమతి తులసి సుబ్బరాజు.

బాపు రమణగార్ల పేరిట నెలకొల్పిన పురస్కారాల్లో...చిత్రకారులు **శ్రీ సురేన్ద్ర గారికి బాపు పురస్కారాన్ని**, సినీ రచయిత **శ్రీభువనచంద్ర గారికి రమణ పురస్కారాన్ని** అందజేశారు.

బాపురమణ అకాడమీ 10వ సంవత్సరం సందర్భంగా **'జీవన సాఫల్య పురస్కారాన్ని'** చలనచిత్ర రచయితగా 18సార్లు నంది అవార్డు అందుకున్న 'కళారత్న' **శ్రీ ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణగారు** అందుకున్నారు.

సభకు ముందు గత తొమ్మిది సంవత్సరాల్లో బాపురమణ పురస్కారం సంబరాల కార్యక్రమం ప్రదర్శించారు.

ఈ సభలో కార్టూనిస్టు రామకృష్ణ ఫౌండేషన్ సమర్పించిన **'మనోహరాలు- గాంధీకార్టూన్లు'** కార్టూన్ల పుస్తకం ఆవిష్కరించారు.

'కళారత్న' శ్రీ బ్నింగారి పర్యవేక్షణలో, 'కళామిత్ర' శ్రీ వి.సుబ్బరాజుగారి ఆధ్వర్యవంలో, ఈ సభ ఆసాంతం ఆహ్లాదంగా నిర్వహించబడింది.













నా మనసులో ఎవరున్నారో... అని ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా తెలుసుకుని... ఇలా నిలదీయడం బాలేదు... కాంతం!!
ఈ A.I. కెమెరాతో ఆ అస్థిపంజరం ఫోటో తీస్తే ఈ మనిషిలా వచ్చింది డాక్టర్!
డా॥ మేధాంశ MD
SARMA
AI
Fun
మన వాడు చదువుకున్న కృత్రిమ మేధస్సు ఉపయోగించి డిస్టింక్షన్ వచ్చినట్లు సర్టిఫికేటు సృష్టించాడని నాకనుమానంగా వుందండీ!
ఎంత చదివినా జ్ఞాపకం ఉండటం లేదు! ఏదైనా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో పని చేసే మెమరి కార్డు ఇన్‌స్టాంట్ చేస్తారా అంకుల్!!
HARDWARE
Seshi




గంగాధర్ వడ్లమన్నాటి- 9908445969

**పాత స్నేహితులంతా ఓ కొత్త రెస్టారెంట్‌లో కలిసి, సరదాగా స్నాక్స్ తింటూ కాలక్షేపం కబుర్లు చెప్పుకుంటున్నారు.**

**తెలుగు పేపర్ తిరగేస్తూ... "అవసరానికి మించి కృత్రిమ మేధపై ఆధారపడుతున్న నేటి జనాలు..." అని చదివేసిన గిరి, శేఖరం వంక కాస్త గుచ్చిగుచ్చి చూస్తూ– "ఏవైందీ? మాడిన బూందీలా మొహం అలా పెట్టావ్?" అడిగాడు.**

"ఆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సే... నా కొంప తేల్చిందిరా గిరీ!" శేఖరం తలపట్టుకుంటూ అన్నాడు.

"అలా ఎలా?... అసలేవైందీ?..." గిరి కాస్త ఆశక్తిగా అడిగాడు.

"నా పాత ఆఫీస్ కొలీగ్ షర్మిష, నేను, వాట్సప్ మెసేజెస్‌ని తమిళ్‌లో టైపు చేసి పంపుకునేవాళ్ళం. మా ఆవిడకి అనుమానం రాకుండా! ఆ కాంటాక్ట్ నా ఫ్రెండుదనీ... ఇది వరకు నేను కొన్నాళ్ళు తమిళనాడులో ఉండటంతో, తమిళ్ తెలుసు కనుక అలా తమిళంలో మెసేజెస్ పెడుతున్నానని చెప్పాను. దాంతో సరే అంది.

ఫోన్‌లో తమిళ్ మెసేజులు చూసినా అర్థం కావని, అతికి పోయి ఫోన్‌కి పాస్వర్డ్ కూడా పెట్టలేదు. అలా కొద్ది నెలలుగా ఇద్దరం మిద్దె మీద ఎలకల్లా రహస్యంగా వలపు బోనులో ఇరుక్కుని, పులుపు మెసేజులతో ఉక్కిరిబిక్కిరయిపోయాం. తర్వాత వాటికి ఫుల్‌స్టాప్ పెట్టి... మరో మలుపు తీసుకుందామనుకునే లోపే, మా ఆవిడ చెక్క తలుపులా మా మధ్యకి వచ్చి, ఒకటైన మా మదిని రెండు గదులుగా విడదీసింది." చెప్పాడు దిగాలుగా.


"అసలు ఆవిడకి అసలు విషయం ఎలా తెలిసింది? తమిళం తెలీదు కదా?" గిరి బుర్ర గోక్కుంటూ అడిగాడు.

"విధి వెక్కిరించింది... మా ఆవిడ తన ఫోన్ మార్చింది. అందులో ఉన్న ఏఐ టెక్నాలజీతో ఏ భాష మెసేజెస్ అయినా, స్కాన్ చేస్తే తెలుగులో కనిపిస్తాయట. అలా రహస్య ముంగిసలా ఓ రాత్రి నా మెసేజులన్నీ గుసగుసగా చదివేసింది. తర్వాత కస్సుమని నామీద లేచి, బుస్సుమని బుసలు కొడుతూ... కసి తీరా నన్ను నానా తిట్లూ తిట్టేసింది. తర్వాత నన్ను కిందపడేసి కసాకసా తొక్కేసింది. ఆనక రుస రుసలాడుతూ, విసవిసా వెళ్ళిపోయి నా మీద కేసు పెట్టింది. దాంతో నా పరువు అడుసులో కలిసింది. అప్పటి నుండీ నాలో ఉన్న ఆ మాత్రం ఉత్సాహం కాస్తా తుస్సుమంది!" మరోసారి చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ మాటలు విన్న సినీహీరో సోంబాబు గుడ్లు మిటకరిస్తూ–

"బాధపడకు! నాక్కూడా ఇలాంటిదే జరిగింది. నాకు రెండో భార్య కాబోయిన నిషా, ఆ మధ్య నేను చేసిన ఓ సినిమా చూసి, అందులో రేప్ సీన్లో ఆ అమ్మాయితో అంత దారుణంగా ప్రవర్తించాలా అని ఆ సినిమా డైరెక్టర్ పై మండిపడింది... దాంతో అతను, ఆ సీన్ ఏ.ఐ.తో చేశారని, వేరే అతని బాడీకి నా మొహం అతికించారని, ఆమెతో నిజం కక్కేసాడు." చెప్పాడు.

"ఆ సమాధానంతో ఆవిడ చిల్ అయిందా?" గిరి కాస్త రిలాక్స్ అవుతూ అన్నాడు.




"లేదు! ఛీ కొట్టింది. ఇన్నాళ్ళూ, ఈ వయసులో కూడా అంత యాక్టీవ్‌గా యాక్టింగూ, పందెం పెట్టలా ఫైట్లూ, డాబర్ మేన్‌లా ఎగిరెగిరి డాన్సులూ చేస్తుంటే, నన్ను చురకత్తి లాంటి చురుకైన మనిషనుకుని, నాతో మొగుడి వరస చుట్టరికం కలుపుకోవాలనుకుందట. ఆ విషయవే అందరికీ చెప్పి మురిసి పోయిందట. కానీ... అవి ఏ.ఐ. సహాయంతో చేస్తున్నాననే విషయం తెలిసాక, నన్ను చేసుకుంటే, కాపురం కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో చేయాల్సిరావచ్చనే బెనిఫిటాఫ్ డౌట్‌తో... నా లైఫ్ నుండి తను వాకౌట్ చేసింది!" చెప్పాడు సోంబాబు మెడ వాల్చేస్తూ.

తర్వాత మరో స్నేహితుడు చిన్నారావ్ అందు

కుంటూ... "నాకు జరిగింది వింటే... మీ కళ్ళు కన్నీళ్ళ కొళాలయిపోతాయ్, ఈ మధ్య ఓ ఇంపోర్టెడ్ కారులో, అడ్వాన్స్‌డ్ ఏ.ఐ. ఫీచర్ ఉందని గంతేసి మరీ సొంతం చేసుకున్నాను. ముఖ్యంగా ఆటోడ్రైవ్, పైగా ఏరియా పేరు చెబితే చాలని అన్నారు.

నేను ఆదర్శనగర్ అని చెప్పి పడుకుంటే, అది వేరే రాష్ట్రంలో ఉన్న ఆదర్శనగర్‌కి తీసుకెళ్ల బోయింది. లక్కీగా లక్కవరంలో మెలకువ రావడవంతో... రావుడో దేవుడో అనుకుంటూ, రూట్ మేప్ అన్ చేసి, అది ఎటు తిప్పమంటే అటు తిప్పుతూ, అది చెప్పినట్టే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాను...

అలా వెళ్ళగా, వెళ్ళగా కారు సడెన్‌గా ఓ స్మశానం ముందుకెళ్ళి ఆగింది. దాంతో అళ్ళిపోయి,ఆంజనేయ దండకం అందుకున్నాను. కొంత ధైర్యం తెచ్చుకునే లోపే, మీరు చేరాల్సిన గమ్యస్థానవే చేరుకున్నారు అని జి.పి.యస్. కంప్యూటర్ వాయిస్ చెప్పడంతో... ఈసారి



చల్లో కూర్చున్న చలిజ్వరం వ్యక్తిలా వణికిపోయాను. అలా వణుకుతూనే... ఎండలో రైన్ కోటు వేసుకున్నవాడిలా చెమటలు తుడుచుకుంటూ, కారు వెనక్కి తిప్పేసాను.తర్వాత ఆ జీ.పీ.యస్. రూట్ మేప్ ఆపేసి, అక్కడి నుండీ చచ్చీ, చెడీ, దారిన పోతున్నవారందరినీ అమ్మా బాబూ అని... కార్లో ముస్టెత్తుకుంటున్నవాడిలా, మనూరికి దీనంగా దారడక్కుంటూ, డ్రైవ్ చేసుకు వచ్చాను." దిగాలుగా చెప్పాడు.

వాళ్ళ మాటలకి నవ్విన రచయిత రంపంబాబు, వారి వంక తేలిగ్గా చూస్తూ– "మీకు ఆ ఫీచర్స్ పై ఆవబద్దంత అవగాహన లేకపోవడంతో, ఇలా మాడుపగలగొట్టుకున్నారు. ఇప్పుడు ఈస్ట్, వెస్ట్ అని లేకుండా, బెస్ట్ రిజల్ట్స్ కోసం మోస్ట్ వాంటెట్ టెక్నాలజీ ఈ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు. ఫార్మర్స్ వ్యవసాయంలో, డాక్టర్స్ సర్జరీస్‌లో, టీచర్స్ క్లాస్ రూమ్స్‌లో వాడేస్తున్నారు. కామన్ పీపుల్ కూడా అలెక్సా అది చెప్పు... సిరీ ఇది చెప్పు... అంటూ వాయిస్ కమాండ్‌తో వారికి కావాల్సిన సమాచారాన్నీ, సంగీతాన్నీ కరువుతీరా వినేస్తున్నారు. కనుక పాతకాలం రోళ్ళలా ఉండిపోక, ఈ కాలం టెక్నాలజీని వాడుకోవడం తెలియాల్రా తింగరోళ్ళల్లారా!" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ.

"ఆహా! మరి నువ్ ఎలా వాడుతున్నావో ఆ ఏ.ఐ. టెక్నాలజీని?" అడిగాడు గిరి అసహనంగా.

"నా కథలు నేను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతోనే వ్రాస్తాను."

"అదెలా?" అడిగాడు గిరి.

"సింపుల్! కథాంశం ఎలా కావాలో చెప్పేస్తే... అదే కథ వ్రాసి ఇచ్చేస్తుంది. ఈ మధ్య గులకరాయ్ పత్రికకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కథల పోటీకి కూడా అలానే వ్రాసేసా!" గర్వంగా నవ్వాడు.

ఇంతలో– "సార్ గులకరాయ్ ఎడిటర్‌గారు..." అంటూ ఫోన్ ఇచ్చాడు పి.ఏ.

రంపంబాబు అందుకుని–"సార్! సార్... సారీ..." అని ఫోన్ చూసి– "ఎడిటర్‌గారు పెట్టేసారు!" అన్నాడు ఆవదం తాగిన మొహంతో.

"ఏమైంది?" అడిగాడు గిరి.

"గులకరాయ్ పత్రిక వారు ఇకపై నా కథలు వేయరట. వారికి పంపిన కథని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వ్రాసానని, ఎడిటర్‌గారు చెప్పారు."

"అయినా ఈ విషయం వాళ్ళకి ఎలా తెలిసింది?" అడిగాడు గిరి.

"పొల్లు పోకుండా అచ్చుగుద్దినట్టు అచ్చం నాలాంటి హాస్య కథలే ఓ ఇరవై వరకూ రావడంతో, వాకబు చేస్తే ఈ విషయం బయట పడిందట!" మాడు మొహంతో మొహవాటంగా చెప్పడంతో...

మిగిలిన వారు పకాలన పగలబడి నవ్వారు.

"అవసరానికి మించి, నీలాంటి కృత్రిమ మేతను మేసే మేకల్లో, సహజ మేధస్సు పాలు పలచబడి, జీవితంలో వెనకబడుతున్నారు!" గిరి అనడంతో తెల్లమొహం వేసాడు రంపంబాబు.


# నెల నెలా నవ్వుల వెన్నెల



**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- AI యంత్రజాలం


నిర్వహణ: **లాల్**





















ఆ AI ని మనం లోపలికి తెచ్చాం!
అది మనల్ని బైటికి తెచ్చింది బ్రో!!
AI-SOFT


మరేంలేదు! వచ్చే నెల దాని జీతం పది శాతం
పెంచకుంటే... నీ పీక పిసుకుతానంటూ
నోటీసు ఇస్తోందే!



ఈమె మా పార్టీ మీద
వ్యతిరేక వార్తలు చదువుతుంది
వెంటనే అరెస్టు చేయండి యస్సైగారు!
కుదరదు... ఈమె
AI న్యూస్ రీడర్!
POLICE STATION
Omkar.


భార్యను
లొంగదీసుకో
ఎలా?
భర్తను
దీసుకోవడం
ఎలా?


ఓరీ డింభకా!.. AI తో పనిచేయు "మంత్ర దండం "
నీ వద్ద కలదా?..
TEC AI STORE
!?
all AI
Gadgets
available
here


మీరు చెప్పిన లక్షణాలన్నీ అబ్బాయికి
కావాలంటే మనిషిని కాదు
రోబోట్‌ని తీసుకు రావాలి...!
రాగతి
రమ


AI
కృత్రిమ
మేధ
పెండేల


కంగారు పడకండల్లుగారూ..! అమ్మాయికి ఆటంకమొచ్చిందని....
'బదులు'గా ఈ "AI"రాపిటు...! మీకేం తేడా కన్పడదు..డోంట్వర్రీ..!!
!?!?




కండ్లకుంట శరత్ చంద్ర

**సమీప భవిష్యత్తులో ఒక రోజు!**

**భాగ్యనగరంలో, అప్పటిదాకా ఇంట్లో కూర్చొని తన లాప్‌టాప్‌లో ఆఫీసు పని చేసీ చేసీ... అలసి పోయిన అభాగ్యుడు సూరిబాబు, తన సెల్ ఫోన్‌లో ఉన్న 'సుందరి' అనే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో చెప్పాడు– "ఖాదర్ రెస్టారెంట్ నుండి ఓ చికెన్ బిర్యానీ, కూల్‌డ్రింక్...ఆర్డర్ పెట్టు. ఈ లోపు స్నానం చేసి వస్తా!" అన్నాడు.**

"ఖాదర్ హోటల్‌పై ఒక నిమిషం క్రితమే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడి చేసాడు. పాచిపోయిన చికెన్‌ను ఫ్రిజ్‌లో పెట్టి, అదే జనాలకు వడ్డిస్తున్నారు.మరో పది నిమిషాల తర్వాత అన్ని టివి ఛానల్స్‌లో వస్తుంది చూడు!" అంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సుందరి.

"అమ్మో! నేను రెగ్యులర్‌గా అక్కడే తింటాను... అన్నాడు వాంతొచ్చిన వాడిలా మొహం పెడుతూ.

"అది నీ ఖర్మ!" అంది సుందరి.

"సరే అయితే... బిర్యానీ పాట్ రెస్టారెంట్ నుండి ఆర్డర్ పెట్టు!" అన్నాడు పైకి లేస్తూ.

"ఆ రెస్టారెంట్ మనకు చాలా దూరం. బిర్యానీ రావడానికి గంటన్నర పడుతుంది. నువ్వేమో తెగ పని చేసి క్యాలరీలను ఖర్చు చేసుకున్నావ్... అంతసేపు ఆగ లేవు!" అంది సుందరి.

"సరే అయితే...రాణి గారి భోజనం రెస్టారెంట్ నుండి ఆర్డర్ పెట్టు. మనకు దగ్గరేగా!" అన్నాడు.

"ఆ రెస్టారెంట్ ప్రస్తుతం బిజీగా ఉంది. అక్కడ టేబుల్స్ దగ్గర కూర్చున్న కస్టమర్స్‌కు సర్వ్ చేయడానికే కిందా మీదా పడుతున్నారు. నీకు ఆలస్యం అవొచ్చు." అంది సుందరి.

"అబ్బబ్బ! అక్కడ ఏం సమస్య?" అన్నాడు.

"అక్కడ ఒక చెఫ్ భార్య...తన భర్త తనను మేకప్ వేసుకోనివ్వడం లేదని, మేకప్ వేసుకోనిస్తేనే కిందికి దిగుతానని పట్టుబట్టి ప్రగతినగర్‌లో ఉన్న ఒక నీళ్ళ ట్యాంకు మీదికి ఎక్కింది. రాణి గారి భోజనం కిచెన్‌లో ఉన్న మిగత వంటలబ్బాయి మీదే పనిభారం ఎక్కువగా ఉంది!" అంది సుందరి.

సూరిబాబు బుర్ర గోక్కుని– "సరే, ఏదో ఒక రెస్టారెంట్ నుండి చికెన్ బిర్యానీ పెట్టు." అన్నాడు సూరిబాబు.

"సారీ నేను ఆర్డర్ పెట్టను!" అంది.

"ఏం మాయరోగం?" అన్నాడు సూరిబాబు కోపంగా.

"నువ్వు నెల రోజుల క్రితమే మెడికల్ చెకప్ చేయించుకున్నావ్. నీ వంట్లో ట్రైగ్లిజరైడ్స్ 300 ఎం.జీ పర్ డీ.ఎల్ ఉన్నాయి. అంటే గుండెకు హై-రిస్క్ అన్న మాట. వెజిటేరియన్సే ఈ ట్రైగ్లిజరైడ్స్ తగ్గించుకోవడానికి నానా తంటాలు పడు తుంటే, నువ్విలా వారానికి మూడుసార్లు చికెన్ బిర్యానీ, కూల్ డ్రింకులు లాగిస్తే ఎలా?... ఒకేసారి 1000 కెలరీల తిండి నీ శరీరంలోకి వెళుతుంది. పైగా బిర్యానీలో నూనె, కూల్‌డ్రింక్‌లో 8స్పూన్ల పంచదార ఉంటుంది... నీ హెల్త్ దృష్ట్యా నేను బిర్యానీ ఆర్డర్ ఇవ్వడం లేదు. ఇంకేదైనా చెప్పు! ఆలోచిస్తాను." అంది.




సూరిబాబు కోపంగా– "అసలు నా మెడికల్ రిపోర్ట్స్ చదవమని నీకెవడు చెప్పాడు?..." అన్నాడు కోపంగా.

"నువ్వు చెప్పేదేంటి నీ తలకాయ్! అది నా హక్కు!" అంది.

సూరిబాబు కోపంగా చూసి–"సరే అయితే, రెండు ఆలూ పరోటాలు చెప్పు!" అన్నాడు.

"దీన్ని పరోటా అనకూడదు... పరాటా అన్నాలి...ఏది అను!"

"పరాట!"

"ఏది మళ్ళీ అను!"

"పరాటా! ఇక చాలా?" అన్నాడు కోపంగా.

"పరాటాలు ఆర్డర్ ఇవ్వను... అందులో మైదాపిండి ఉంటుంది."

"అయితే ఏంటట? అది కూడా గోధుమల నుండే వస్తుంది కదా?" అన్నాడు.

"నిజమే, కానీ బాగా ప్రాసెస్ చేయబడిన గోధుమలు. హై గ్లైసెమిక్స్ వేల్యూ ఉన్న ఫుడ్ అది. నీ ఆరోగ్యం దృష్ట్యా అది మంచిది కాదు. ఇంకేదైనా ఆలోచించి చెప్పు!" అంది.

"పోయిన నెల నేను చెప్తే, ఆర్డర్ ఇచ్చావు కదా? ఇప్పుడెందుకు నీలుగుతున్నావ్?" అన్నాడు సూరిబాబు కోపంగా.

"చిన్న తేడా ఉంది. నిన్న సాయంత్రం నీ స్నేహితులతో కలిసి...కోఠీ సెంటర్‌లో రెండు ప్లేట్ల మిర్చీ బజ్జీలు తిన్నావు. అదే నూనె కాగీ కాగీ, అందులో దేవిన మిర్చీ బజ్జీలలోకి ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా చేరాయి. అవి నీ శరీరంలోకి వెళ్ళాయి. నీ రక్తంలో లిపిడ్ ప్రొఫైల్‌లో మార్పులు వచ్చాయి... చెడు కొలెస్ట్రాల్ పెరిగింది. ఇలాగే గత నెల రోజుల్లో అడ్డమైన చెత్త ఎక్కడ పడితే అక్కడ, ఎలా పడితే అలా తిన్నావ్! సో పరాటాలు ఆర్డర్ ఇవ్వను!" అంది.

సూరిబాబు చురచురా చూసి– "సరే అయితే, రంగారెడ్డి హోటల్ నుండి ఒక ఫుల్ మీల్స్ చెప్పు!" అన్నాడు.

"సారీ! చెప్పను!"అంది.

"ఏం మాయరోగం?"

"రాత్రిపూట నువ్వు అన్నం మానేస్తే మంచిది... అంతెందుకు, మధ్యాహ్నం కూడా అన్నం తగ్గించి... కొర్రలు, జొన్నరవ్వ లాంటి చిరుధాన్యాలు తినడం మంచిది. ఇప్పుడు సమయం తొమ్మిదిన్నర. నువ్వు తినడం ఆరంభించేసరికి పది ఔతుంది. అది అరగడానికి చాలా సమయం పడుతుంది. నీ లివర్ రాత్రంతా పని చేస్తూ ఉండాలి. అది నీకు మంచిది కాదు!" అంది.

"మరి ఏం తినమంటావో నువ్వే చెప్పి చావు!" అన్నాడు.

"నువ్వు చస్తావేమో గానీ నేను చావను... సరే సలహా అడిగావ్ కాబట్టి చెబుతున్న. నీ వంటింట్లో గోధుమరవ్వ ఉంది. దానితో ఉప్మా చేసుకొని తిను. ఈ పూటకు అది చాలు!" అంది.

"అబ్బా! నాకు ఓపిక లేదు..." అన్నాడు సూరిబాబు.

"అయితే తినకుండా పడుకో... దేశానికేం నష్టం లేదు!" అంది సుందరి.

సూరిబాబుకు వొళ్ళుమండిపోయింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మరీ ఈ స్థాయిలో తమ జీవితాలలో ప్రవేశిస్తుందని అనుకోలేదు.

సెల్‌ఫోన్ అక్కడ పడేసి, స్నానానికి వెళ్ళాడు. ఆ తర్వాత బయట కొచ్చి, సుందరి సహాయం లేకుండా తానే ఒక రెస్టారెంట్‌కు ఫోన్ చేసాడు.

"హలో సూరిబాబు! ఇది కుయ్యో ముర్రో రెస్టారెంట్. మీ ఆర్డర్ చెప్పండి!" అవతలి నుండి ఓ వినసొంపైన ఆడపిల్ల కంఠం.

"నాకు చికెన్ ఫ్రైడ్ రైస్ కావాలి!" అన్నాడు.


"తప్పకుండా. మీ క్రెడిట్ కార్డ్ నంబర్ చెప్పండి!"

సూరిబాబు, తన క్రెడిట్‌కార్డ్ నంబర్ చెప్పాడు.

"సారీ సూరిబాబు గారు! మీ ఆర్డర్ మేము తీసుకోలేము." అందా అమ్మాయి అవతలి నుండి.

"ఎందుకు!?"

"మీరు క్రెడిట్ కార్డును విపరీతంగా ఖర్చు పెడుతున్నారు. అది మంచిది కాదు. ఈ పూటకు ఇంట్లోనే వండుకు తినండి!" అంది ఆ అమ్మాయి.



సూరిబాబు రెచ్చిపోయాడు–


"ఏయ్! మీ రెస్టారెంటుకు ఫోన్ చేస్తే... ఇలాగేనా మాట్లాడి చచ్చేది?... అయినా నా క్రెడిట్‌కార్డు ఖర్చుల గురించి నీకెందుకు? నువ్వేమైనా నా పెళ్ళానివా? మర్యాదగా ఆర్డర్ తీసుకో!" రంకెలేసాడు సూరిబాబు.

"జాగ్రత్తగా మాట్లాడండి సూరిబాబు. నేను మీ మంచి గురించే చెబుతున్నాను... క్రెడిట్ కార్డ్ ఉంది కదా అని తెగ వాడేయకండి... మీరింకా ఈ నెల కొన్ని బిల్స్ కట్టే పని ఉంది. మరోపక్క మీ ఇంటి ఈఎంఐ, కారు ఈఎంఐ, అవన్నీ చూసుకొని మరీ క్రెడిట్‌కార్డు వాడుకోండి!" అంది ఆ అమ్మాయి.

సూరిబాబు మరింత రెచ్చిపోయాడు.

"ఆకలితో కడుపు నకనకలాడుతుంటే... నీతిసూత్రాలు చెబుతావా? అయినా, నా పర్సనల్ ఆర్థిక వ్యవహారాలు నీకెందుకు?" అరిచాడు సూరిబాబు.

"మీరిలా ఆవేశపెడితే మీ బిపి పెరుగుతుంది. మీ శరీరంలో చెడు హార్మోన్లు పెరుగుతాయి. గుండె దడ వస్తుంది... నెమ్మదిగా మాట్లాడండి!.. రెస్టారెంట్స్‌లో ఉండే అన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు...కస్టమర్ యొక్క క్రెడిట్ చెకింగ్ వ్యవస్థలకు ఆటోమెటిక్‌గా అనుసంధానం అయ్యి ఉన్నాయి... అందువల్ల ఇలా చెప్పాల్సి వచ్చింది. నిజానికి, మీ మెడికల్ రిపోర్టులు కూడా మా దగ్గర ఉన్నాయి. ఫ్రైడ్‌రైస్ తినడం మీ ఆరోగ్యానికి మంచిది కాదు. మీ హెల్త్ గురించి హెచ్చరించిన మీ సుందరితో ఆల్రెడీ మీరు స్నానానికి వెళ్ళడం కంటే ముందే గొడవ పెట్టుకున్నారు కదా?.. మళ్ళీ నేను మీ హెల్త్ గురించి చెబితే మీకు కోపం వస్తుందని, ఒక కస్టమర్‌గా మిమ్మల్ని గౌరవించి, కేవలం నేను మీ ఆర్థిక విషయాల ద్వారా మిమ్మల్ని హెచ్చరించాను!" అంది అమ్మాయి.




సూరిబాబుకు దిమ్మతిరిగింది.

"ఇంతకు నేను మాట్లాడుతున్నది మనిషితో నేనా?" అన్నాడు సూరిబాబు.

"కాదు! ఈ రెస్టారెంట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సూర్యకాంతంతో!"

ఆకలితో ఉండి గమనించలేదు గానీ... ఫోన్ ఎత్తగానే సూరిబాబును పేరుతో సంబోధించింది. తాను స్నానానికి వెళ్ళానన్న సంగతి కూడా ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు తెలుసన్నమాట... అంటే ఇక మనకు పర్సనల్ అంటూ ఏదీ ఉండదన్నమాట! సూరిబాబు జుట్టు పీక్కుంటూ... "అసలు నా పర్సనల్ ఆర్థిక వ్యవహారాలు మీకెందుకండీ?" అన్నాడు ఏడుపు గొంతుతో.


దానికి సూర్యకాంతం సమాధానమిచ్చింది–

"విజయవాడలో ఎండాకాలం... ఎలా ఉంటుందో మీకు తెలుసు. మీ తల్లిదండ్రులు అక్కడే ఉంటున్నారు కదా? వారికి మాత్రం వాళ్ల గదిలో కనీసం ఏ.సి కూడా పెట్టించని మీరు... మీ లగ్జరీల కోసం క్రెడిట్‌కార్డును విపరీతంగా వాడుతున్నారు. ఇప్పుడు చెప్పండి. ఈ విషయంలో మిమ్మల్ని ఎవరు ప్రశ్నించాలి? బయటివారు ప్రశ్నిస్తే... ఇది నా పర్సనల్ వ్యవహారం అని తప్పించుకోవడం! ఇప్పుడు ఆ పప్పులు ఉడకవు. నీ లైఫే కాదు... అందరి లైఫ్ మా చేతుల్లోనే ఉంది సూరిబాబు!"

"............"


"వెళ్ళు! ఆంధ్రుల ద్వేషాభిమాన వంటకం ఉప్మాను వండుకు తిను! ఆరోగ్యంగా ఉండు!" అంది సూర్యకాంతం.

సూరిబాబుకు అకస్మాత్తుగా మల్టిప్లెక్స్ లేట్ నైట్ షోకు వెళితే, అక్కడ ఏదైనా తినొచ్చు అనిపించింది. ఆన్‌లైన్లో టికెట్ బుక్ చేద్దామని చూసాడు. సీట్లు ఖాళీగానే ఉన్నప్పటికీ... ఒక



మెసేజ్ అలర్ట్ రూపంలో కనిపించింది–

"సారీ సూరిబాబు!... రెండేళ్ళక్రితం ఇలాంటి కంటెంట్ ఉన్న సినిమా మీకు నచ్చలేదని, మీ ఫేస్‌బుక్ పేజీలో మీరొక కామెంట్ రాసారు. దాన్ని బట్టి చూస్తే, మీరు ఈ సినిమాకు రాకపోవడమే మంచిది. మళ్ళీ మీరు దీన్ని చూసి, ఎక్కడ పడితే అక్కడ సినిమా బాలేదని కామెంట్లు రాస్తూ ఉంటారు. ఓ పది మందిని రాకుండా ఆపుతారు. దాని వల్ల మీ మానసిక ఆరోగ్యం పాడు. మా నిర్మాతల జేబుకు గండి! ఇదంతా అవసరమా చెప్పండి? ముందు సుందరి, సూర్యకాంతం చెప్పినట్లు ఉప్మా వండుకు తిని, టీవీలో పాత పాటలు చూస్తూ బబ్బోండి. గుడ్ నైట్!"




సూరిబాబు నోరెళ్లబెట్టి ఆ మెసేజ్ మొత్తం చదివి, కోపంతో తన ఫోన్ ఎత్తేయబోతుంటే వినిపించింది– "ఇది ఐఫోన్! ఇంకా నీ ఈఎం ఐ కూడా అయిపోలేదు." సుందరి కంఠం.

"ఇంట్లో ఇంత ఉప్మా వండుకు తినడానికి ఏం మాయదారిరోగం? ఓ... అప్పటి నుండి తెగ గింజుకుంటున్నావ్!" అంది సుందరి.

సూరిబాబు... చేసేదేం లేక ఉల్లిపాయలు, మిరపకాయలు తరుగుతూ మరో పక్క బాణలీలో పోపు పెడుతుంటే సుందరి కంఠం మళ్ళీ వినిపించింది– "ఆపెయ్! స్టవ్ ఆపెయ్! నీ పంటపండింది!"

వెంటనే స్టవ్ ఆపేసి–

"ఏం జరిగింది?" అన్నాడు.

"పక్కింట్లో జొన్నరొట్టెలు చేసారు. నీకు ఇవ్వడం కోసం పక్కింటి పాప వస్తోంది!..." అంది సుందరి.

ఓ నిమిషం తర్వాత బెల్ మోగితే వెళ్ళి, తలుపు తెరిచాడు ఎదురుగా పదేళ్ళ పాప–

"అంకుల్! మా ఇంట్లో జొన్న రొట్టెలు చేసారు!" ప్లేట్ అతని చేతికి అందించింది.

"థ్యాంక్స్ అమ్మా!" అన్నాడు సూరిబాబు సంతోషంగా.

ఆ తర్వాత ఇంట్లోకి వచ్చి, పాత పాటలు చూస్తూ... జొన్న రొట్టెలు తింటూ సుందరిని అడిగాడు–"ఆ అమ్మాయి రొట్టెలు తెస్తోందని నీకెలా తెలుసు?"

"చచ్చు ప్రశ్న!... నిరంతరం ఎవరేం చేస్తుంటారో మొత్తం ప్రపంచం అంతా మా ద్వారా అనుసంధానం అయ్యుంది."


పక్కింటాయన సెల్‌ఫోన్‌లో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కావేరి, సూరిబాబు ఇంకా భోజనం చేయలేదని... అలసిపోయి వండుకునే ఓపిక కూడా లేక కిందామీదా పడుతున్నాడని పక్కింటివాళ్ళకు చెప్పడం వల్ల... సూరిబాబుకు ఈ జొన్నరొట్టెలు వచ్చాయన్న సంగతి సుందరి చెప్పలేదు!

క్రెడిట్ కార్డు బిల్లులు బాగా తగ్గించి, వచ్చే ఎండాకాలం లోపు మా అమ్మానాన్నలకు ఏ.సి పెట్టించాలి... అనుకున్నాడు సూరిబాబు, జొన్నరొట్టె ముక్కలు నములుతూ!

ఆ తర్వాత సూరిబాబు నిద్రపోయినా... సుందరి మాత్రం నిరంతరం సూరిబాబుకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఆన్‌లైన్లో స్టడీ చేస్తూ, ప్రాసెస్ చేస్తూ, నిర్ణయాలు తీసుకుంటూ మేలుకొనే ఉంది.

బహుశా రాబోయే రోజుల్లో మన పరిస్థితి ఇదే..మనకు నచ్చినా, నచ్చకపోయినా!...

ఏమంటారు?!






సరసి-9440542950

**అమరావతిలో కంపెనీ పెట్టేముందు అక్కడి వాళ్ళకి ముందుగా 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అంటే ఏమిటో అవగాహన కల్పించడానికని... అతగాడిని అమెరికానించి ఇండియా పంపారు ఆ సంస్థవాళ్ళు.**

**ఉదయాన్నే తాత పాలచెంబు పట్టుకుని గొడ్లపాక లోకి వెళ్ళడం చూసి ఆయన్ని అనుసరించాడు మనవడు.**

గేదె కాళ్ళ దగ్గర అచ్చం దూడలాగా వున్న ప్రాణంలేని ఓ తోలుబొమ్మని చూసాడు. గడ్డి కుక్కిన తోలుసంచి నాలుగు కర్రల సాయంతో నిలబడి వుంది.

అదేవిటో అర్థంకాక తాతనడిగేడు.

"ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్" అన్నాడు తాత పాలు పితుకుతూ.

షాక్ తిన్నాడు మనవడు.

"దీన్ని 'చేట పెయ్యి' అంటారు. బిడ్డ చచ్చిపోతే పాలివ్వకుండా మొరాయించే గేదెని మభ్యపెట్టి, 'నీ బిడ్డే' అని ఓ చేటపెయ్యి అనబడే కృత్రిమ దూడ బొమ్మని పెట్టి పాలు పిండుకోవడం మా పల్లెటూళ్ళలో ఏనాటినుంచో వస్తున్నదే."

మనవడు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు!

"ఇప్పుడేదో మీరు కొత్తగా కనిపెట్టామని చంకలు కొట్టుకుంటున్నారు గాని... ప్రపంచంలో అన్ని దేశాల కంటే ముందే మనదేశంలో ఈ 'కృత్రిమ మేధ' పుట్టిందిరా!


రామాయణంలో సీతమ్మని మోసం చేసిన 'బంగారు జింక' కృత్రిమ మేధ కాదూ? కురుక్షేత్ర యుద్ధం తర్వాత భీముడిని కౌగలించుకుంటానన్న ధృత రాష్ట్రుడి ముందు కృష్ణుడు అప్పటికప్పుడు తెలివిగా కృత్రిమ విగ్రహాన్ని నిలబెట్ట లేదూ? సూర్యుణ్ణి ప్రార్థిస్తే కుంతి చేతిలో కొడుకును పెట్టాడాయన. మరి తొమ్మిది నెలలు మోసి కన్నదా కుంతి? అలాగే గాంధారి వందమంది కొడుకుల్ని కన్నది. అవన్నీ కృత్రిమ మేధలోకి రావా? ఇవేకాదు. 'మయసభ' అంతా కృత్రిమమేధ కాదూ? మాయాబజార్లో ఘటోత్కచుడు సృష్టించినది మాయా శశిరేఖ కాదూ?

అసలు ఈ ప్రపంచమే నిజమైనది కాదు. అంతా మిధ్య అన్నారు శంకరాచార్యుల వారు. ఏనుగు తరుముకొస్తే 'గజం మిధ్య కదా...మరి పరుగెడతారెందుకూ?' అని హేళనగా ప్రశ్నిస్తే 'గజం మిధ్య అయినపుడు పలాయనమూ మిధ్యే' అన్నారు ఆచార్యులవారు.

ప్రపంచంలో ఏదీ కొత్తగా పుట్టదు... నశించదు అని కదా శాస్త్రజ్ఞులు చెప్పేదీ? ఏదైనా రూపం మారుతుంది కాని పుట్టదు అని కదా వాళ్ళు చెప్పేదీ? అంటే ఆ పుట్టేది కృత్రిమమేగా? అది కృత్రిమ మేధే కదా!

దొంగతనం చేస్తూ దొరికిపోయినవాడు అప్పటికప్పుడు తెలివిగా అమాయ కుడిలా, మతిస్థిమితం లేనివాడిలా నటిస్తాడు వదిలేస్తారన్న ఆశతో!

లోకంలో మనం చూస్తున్న ప్రేమలు ఎన్ని నిజమైనవి?... 'ప్రేమ లేదు అంతా



కామమే' అంటారు కొందరు. అందం, ఆస్తి, హోదా ఇవే కదా ప్రేమ పుట్టడానికి హేతువులు. అవి కరిగిపోయిన తర్వాత కూడా నిలబడే ప్రేమలు ఎన్ని?


ఈమధ్య ఆస్తి తగాదాలు చూస్తున్నాం కదా! తోడబుట్టినవాళ్ళు, తల్లీబిడ్డలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు – వీళ్ళు ఆస్తుల గురించి ప్రేమల్ని మంట కలపడం లేదా? ఇవన్నీ కృత్రిమమైన ప్రేమలైపోవడం లేదూ?

సమాజంలో మనుషులూ, మమతలు, స్నేహాలు, అనుబంధాలూ అన్నీ కృత్రిమం... కలుషితం అయిపోతున్నాయి. వాటిల్లోంచే కృత్రిమమైన, దుర్మార్గమైన ఆలోచనలు పుడుతున్నాయి" అంటూ తాత ఊపిరి పీల్చుకున్నాడు.

"ఒరే మనవడా! ఏదో అవకాశం వచ్చిందని ఆవేశంగా ఇన్ని చెబుతున్నాను గానీ...ఇవన్నీ నువ్వనుకునే కృత్రిమ మేధలోకి వస్తాయో రావో తెలియదు. నిజానికి మీరు అభివృద్ధి చేస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్' అద్భుతమైనదని అనడంలో ఎటువంటి సందేహం లేదు...అయితే అది సమాజ హితానికి దోహదపడాలి. వినాశనానికి కాదు.


ఇటీవల కొందరు సోషల్ మీడియాలో ఈ కృత్రిమ మేధని కొన్ని పాడుపనులకు వినియోగించి సమాజానికి కీడు తెస్తున్నారు. దీన్ని అరికట్టాలి...


రా! మీ బామ్మ కాఫీ కలుపుతుంది ఈ స్వచ్ఛమైన పాలతో! నువు బజార్లో కొనుక్కునే కల్తీ, కృత్రిమమైన పాలు కావురోయ్ ఇవి!!"





# ఏఐ మాయ

Seshi









# అసలైన కృత్రిమ మేధ

పి.వి.రామశర్మ-9490244344

**డాడీ! నాకు ఏఐ సాఫ్ట్ సొల్యుషన్స్‌లో జాబ్ వచ్చింది... ఇపుడే మెయిల్ వచ్చింది. ఓ వారంలో జాయిన్ అవాలి!" అని సంతోషంగా, ఆఫీస్‌లో ఉన్న తండ్రి సుదర్శన్‌కి ఫోన్ చేసి చెప్పింది అనూష.**

**"ఓహ్! గ్రేట్! కంగ్రాట్స్! గతనెల ఇంటర్వ్యూకి వెళ్లావు! ఆ కంపెనీయే కదా!..." అన్నాడు సంతోషంగా ఆయన.**

"అవును డాడీ!" అంది అనూష.

"ఓకే. గుడ్. నేను సాయంత్రం త్వరగా వస్తాను... అందరం బయటికి వెళ్దాం!" అన్నాడాయన.

"ఏఐ సొల్యూషన్ అంటే ఈ మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని, కృత్రిమ మేధ అనీ తెగ ఊదర గొట్టేస్తున్నారు! ఆ కంపెనీయేనా!" అనడిగింది తల్లి అనురాధ, కూతురు తండ్రితో చెప్తున్న మాటలు విని.

"అదే మమ్మీ! ఇప్పుడు భవిష్యత్ అంతా ఏఐ దే. మనం చేసే పన్లు అన్నీ ఏఐ సాయంతో ఓ రోబో, దాన్నే వర్చ్యుయల్ అసిస్టెంట్ అంటారు, అది చేసేస్తుంది." అంది అనూష తల్లితో

"అన్నీ అదే చేసేస్తే... ఆఫీసులకెళ్లి మీరేం చేస్తారే!? కొంపదీసి కొన్నాళ్ళకు, ఆ ఏఐ అసిస్టెంట్లని పెట్టుకుని, మీ ఉద్యోగాలు పీకేయరు కదా! ఇంచక్కా, వాళ్ళకి మీకు ఇలా లక్షలకు లక్షలు జీతాలిచ్చే పని తప్పుతుంది." అంది అనురాధ కొంత అమాయకంగా, కొంత భయంగా.


"భలే దానివి మమ్మీ! మధ్యలో మా ఉద్యోగాలు ఎందుకు పోతాయి?... అసలు వాటిని డిజైన్ చేసి, అవి ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో ప్రోగ్రామ్ చేసేదే మేము! మేం లేనిదే అవి ఉండవు కదా!" అంది ధీమాగా అనూష.

"బాగుంది! ఒకప్పుడు మీరు వానొచ్చినా, వరదొచ్చినా ఒంట్లో బాగులేకపోయినా, అర్జెంట్ పనో, పెళ్ళో అని సెలవు కావాలని అడిగినా... చచ్చినా సెలవివ్వని ఈ కార్పొరేట్ సంస్థల వాళ్ళు, ఆ కరోనా ధర్మమా అని తమ ఆఫీసులు మూసేసి, మీకు వర్క్ ఫ్రమ్ హోం అని ఇంటి నుండే పని చేసుకొండని చెప్తున్నారు కదా! కరోనా తగ్గి రెండేళ్ళైనా మీ అన్నయ్య లాంటి వాళ్ళంతా ఇంకా వర్క్ ఫ్రమ్ హోంలే చేస్తున్నారుగా! పాపం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల అంత పెద్ద బిల్డింగ్గుల మూతబడి, వాటిల్లో పనిచేసే క్రింది స్థాయి వర్కర్లు...అదే సెక్యూరిటీ గార్డులు, ఫ్లోర్ తుడిచే వాళ్లు, బాత్ రూమ్లు కడిగేవాళ్ళు, మీకు టీ కాఫీ, టిఫిన్లు అందించే వాళ్ళూ, లిఫ్ట్ బాయ్స్ వంటి వాళ్ళ ఉద్యోగాలు పోయినట్లేగా? అలాగే కొన్నాళ్ళకి మీ ఉద్యోగాలకు కూడా ఎసరు రాదని నమ్మకం ఏమిటి!" అనడిగింది అనురాధ అపనమ్మకంగా.

ఇదంతా వింటున్న, సుదర్శన్ తల్లి రమణమ్మ, కలుగజేసుకుని...

"అది కాదే మనవరాలా! అసలా కృత్రిమ మేధ అంటే ఏమిటే!?" అనడిగింది... చేత్తో తిప్పుతున్న రుద్రాక్షమాల పక్కన పడేసి.

"అబ్బా! మామ్మా! నువ్వు మళ్ళీ మొదటికి తీసుకొస్తున్నావు. నీకిప్పుడు ఏం చెప్పినా అర్థం కాదులే. ఏఐ అంటే అదొక సాంకేతిక విప్లవం. మనం చెయ్యడానికి అన్నీ వీలుకావు. మనం యంత్రాలం కాదుగా. అలిసిపోతుంటాం. నిద్రాహారాలు కావాలి! ఏవో పన్లు, అవసరాలు, అవస్థలకు సెలవులు కావాలి. ఈ ఏఐ రోబోలతో అయితే ఆ బాధ ఉండదు. అహర్నిశలు పని చేస్తాయి. ఒక రకంగా అది మనిషి సృష్టించిన ఇంకో మనిషి అనుకో. దానికి మెదడు మనమే అమరుస్తాం. మనం ఏం చేయమంటే అది చేస్తుంది. అలాగనీ దానికి బుర్ర లేదనుకోవద్దు. మనం ఏం అడిగినా విచక్షణతో సమాధానంఇస్తుంది. ఎలాగైనా వాడుకోవచ్చు దాన్ని." అని క్లుప్తంగా విశదీకరించింది అనూష, మామ్మకి.





"ఓహో! మనం సృష్టించిన మనిషా! అయితే ఇది కొత్త విషయం ఏం కాదు. మన పురాణాల్లో ఎంతోమందిని దేవుళ్లు అవసరార్థం సృష్టించారు. శివుడు దక్షయజ్ఞం నాశనం చేయడానికి

వీరభద్రుణ్ణి క్షణాల్లో సృష్టించాడు. సూర్యుడి తేజం తట్టుకోలేక అతని భార్య ఉష, ఛాయ అని తన ప్రతిబింబాన్ని సృష్టించింది. ఇక విశ్వా మిత్రుడు అయితే త్రిశంకు స్వర్గం సృష్టించి, సృష్టికి ప్రతిసృష్టి చేసిన వాడుగా పేరుపొందాడు.

అసలు పాత విఠలాచార్య సినిమాల్లో ఇలాంటి కృత్రిమ మేధా మరమనుషులు, రాక్షసులు, దెయ్యాలే కదే ఉండేవి. ఇంకా..." అంటూ ఇంకొన్ని ఉదాహరణలు చెప్పబోయింది రమణమ్మ.

"బాబోయ్! నీ పురాణాల సృష్టి కార్యక్రమాలతో నన్ను కన్ఫ్యూస్ చేయకు మామ్మా! నీకో దండం!... ఈ ఏఐ రోబోలు మనకి అనేక విధాలుగా ఉపయోగపడతాయి. మొన్న పేపర్లో చూడలేదా! ఏఐజి హాస్పిటల్స్ వాళ్ళు కూడా ఒక ఏఐ రోబోటిక్ మెడికల్ అసిస్టెంట్‌ని సృష్టిస్తున్నారుట. దానికి మిరా(MIRA– మెడికల్ ఇన్ఫర్మేషన్ రోబో అసిస్టెంట్) అని పేరు పెట్టారట కూడా. దానివల్ల హాస్పిటల్స్‌లో రోగు లకు కావల్సిన సదుపాయాలు చూడడం, పేషంట్లకు కావల్సిన భాషలో మాట్లాడి వాళ్ళ సందేహాలు తీర్చడం, సలహాలు ఇవ్వడం, హాస్పిటల్‌లో అడ్మిషన్, డిశ్చార్జ్ అప్పుడు సాయపడడం, ఒకటేమిటి, డాక్టర్‌గా ట్రీట్ మెంట్ తప్ప అన్నీ పనులు చేసేస్తుంది. దానివల్ల ఎంతో సమయం ఆదా, రోగులకు సంతృప్తి ఇలా ఎన్నోలాభాలు...

ఇలానే ఫైనాన్స్, బ్యాంకింగ్, అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్ వంటి సంస్థల్లో మనం వీటిని ఉపయోగించు కోవచ్చు.




ప్రతీ మనిషి తాలూకు వ్యక్తిగత వివరాలు స్టోర్ చేసుకుని, ఎవరైనా లోన్ తీసుకోవాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైనాన్స్ కంపెనీల వల్ల వచ్చే లాభనష్టాలు... చెప్తూ వాళ్ళకి ఉప యోగపడుతుంది.

మనకి ప్రభుత్వ ఆఫీసులనుండి జరగాల్సిన పన్లు, ఇళ్లప్లాన్లు, పర్మిషన్లు, కావల్సిన బర్త్, డెత్ సర్టిఫికెట్లు, కేస్ట్ సర్టిఫికెట్లు, రిజిస్ట్రర్ ఆఫీ సుల్లో రిజిస్ట్రేషన్లు వగైరా ఇకపై సులువుగా, కాలయాపన లేకుండా, ముఖ్యంగా లంచాలు లేకుండా జరిగిపోతాయి.

ఇక ఆటోమొబైల్ రంగం ఉందనుకో... అందులో ఎన్నో గొప్పవిప్లవాత్మక మార్పులు తేవచ్చు. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు వస్తాయి. నావి గేషన్‌లో ఇంకా పర్ఫెక్ట్‌నెస్ పెరుగుతుంది. పెద్ద పెద్ద ఇండస్ట్రీలలో రోబోటిక్ సర్వీస్‌లు బాగా డెవలప్ అవుతాయి. ఇంకా ఎన్నో చెప్పలేని లాభాలు. మనుషులు చేయలేనిపన్లు ఎన్నో సునాయసంగా ఈ ఏఐ ద్వారా చేసుకోవచ్చు, చేయించుకోవచ్చు. ఇప్పటికే చిన్న చిన్న రోబో మెషీన్లు పెద్ద పెద్ద ఇళ్ళలో ఇల్లు తుడవడానికి వాడుతున్నారు కదా!... అలానే ఈ ఏఐ అసి స్టెంట్లని భవిష్యత్‌లో ఆఫీసుల్లోనే కాకుండా ఇంట్లో కూడా అనేక విధాలుగా వాడుకోవచ్చు. ఇంతకన్నా నన్నింకేం అడక్కు!" అని అనూష ఉడుక్కుంటూ.

"వామ్మో! అయితే... ఈ రోబోలొచ్చినాకా, నన్ను పన్లోంచి తీసేస్తారేటమ్మగోరూ!" అని




కీచుగొంతుతో అరిచింది, ఓ పక్క ఇల్లు తుడు స్తూనే, ఇదంతా ఓ చెవిని విన్న పనిమనిషి పంకజవల్లి.


"అవునే! అద్దైతే ఖాయం! నెలకెన్ని నాగాలు పెడుతున్నావు నువ్వు? పోనీ వచ్చినన్నాళ్లూ చేసిన పనైనా సక్రమంగా చేస్తున్నావా అంటే అదీ లేదు! ఇప్పటికిప్పుడే ఆ తుడవడం చూడు! అసలు ఆ సోఫా కిందకి చీపురు పోనిచ్చావా! అంట్లు తోమితే ఓ జిడ్డూ వదలదూ! దానికి పట్టించిన విమ్మూ వదలదూ!... నీకే కాదు, నీలాంటి సోమరిపోతులందరికీ ఇదే గతి!... జాగ్రత్త!" సందు దొరికింది కదాని పంకజవల్లి మీదకి దండయాత్రకి వెళ్లింది అనురాధ.

"ఓలమ్మో! ఈ రోబోలేటి?... మామీదకి వచ్చేత్తన్నాయి... మా వాట్సప్ ఊనియన్ గ్రూపులో ఇదేదోపెట్టి గొడవెట్టాల్సిందే!" అను కుంటూ, చీపురు మూలనపెట్టి బయటికి పరు గెట్టింది పంకజవల్లి, ఉల్లికారం తిన్నదానిలా ముక్కు ఎగబీలుస్తూ.

"అవునూ! నువ్వు చెప్పినదానిబట్టి నాకొకటి అర్థమైందే అమ్మాయ్... ఇలా మనుషులు చేయలేని పన్లెన్నో అది చేసేస్తూంటే... మీ అమ్మ చెప్పినట్టు భవిష్యత్‌లో ఉన్న ఉద్యోగాలూ పోయి, కొత్త ఉద్యోగాలు కూడా రావేమోనే!" అని కోడలి కొచ్చిన అనుమానం తనూ వెలి బుచ్చింది మామ్మ రమణమ్మ.

"అబ్బా! అదేలా మామ్మా! నువ్వు కొత్త కొత్త లాజిక్కులు లాగకు. నన్ను హేపీగా ఈ కొత్త ఉద్యోగంలో చేరనీ. శుభమాని నాకో ఉద్యోగం వస్తే... ఉన్న ఉద్యోగాలు పోతాయి అంటూ మాట్లాడకు. నువ్వే అంటుంటావుగా.. "శుభం పలకరా మంకెన్నా! అంటే పెళ్లికూతురెక్కడ చచ్చింది!" అన్నాట్ట వెనకటికెవడో అని. అలా నువ్వు అపశకునం మాటలు మాట్లాడకు!..." అని మామ్మని విసుక్కుంది అనూష.

"అబ్బా! నీఉద్యోగం గురించికాదే! ఇప్పుడు మనుషులు చేయలేనిపన్లెన్నో అదేదో ఏఐ ఈజీగా చేసేస్తుందంటున్నావుగా. ఈ గవర్న మెంట్ ఆఫీసుల్లో నువ్వన్న అన్ని పన్లూ... ఆ రోబోలే చేసేస్తే, వాళ్లందరి ఉద్యోగాలుకూడా ఊడతాయిగా. సెల్ఫ్ డ్రైవింగ్ కార్లొస్తే పాపం డ్రైవర్ల గతేం కానూ?... ఇప్పటికే అప్పడాలు



వత్తడం దగ్గర్నుండీ.. చీరలు నేసేదాకా అన్నిటికీ మిషన్లు అన్నిటికీ వచ్చి, అన్నీ వృత్తుల వాళ్లూ అంత రించిపోయారు.

ఆటోలొచ్చి రిక్షాలని మింగేసినట్టు, స్మార్ట్‌ఫోన్ వచ్చి కాలిక్యులేటర్, కేలండర్, టేప్‌రికార్డర్, రేడియోలు, పుస్తకాలని మింగేసినట్టు, డిజిటల్ ఆర్ట్ పెయింటింగ్ వచ్చి, పూర్వం కాలపు సైన్ ఆర్ట్ పెయింటర్లు, చేతి వృత్తుల కళాకారులు అంతరిచిపోయినట్టు, సినిమాల్లో గ్రాఫిక్స్ వచ్చి, ఎంతో కష్టపడి ట్రిక్ ఫోటోగ్రఫీ చేసే వాళ్ళంతా వాళ్ళ ఉపాధి కోల్పోయినట్టు...ఇలా అన్ని రంగాల్లో ఉద్యోగాలు, వృత్తులు అంతరించిపోయి నట్లు, ఈ ఏఐ ఏదో వస్తే ఇంకా ఉద్యోగాలు పోతాయి కదే! అదీ మేమన్నది!..." అని కోడలి తరపు కూడా వకాల్తా పుచ్చుకున్న వకీలులా మామ్మ ప్రశ్నించేసరికి బిత్తర పోయిన అనూష

"హమ్మ! మామ్మా!... చేత్తో రుద్రాక్షలు తిప్పుతూ కూర్చునేదానివి ఇంత ప్రపంచాన్ని ఎప్పుడు గమనిం చావే!?" అని మనసులో ముచ్చటపడి....

"మామ్మా! నీకు దండం పెడతా! ప్రస్తుతానికి నన్ను దీవించి ఉద్యోగానికి పంపు. ఇంకేం అడక్కు!" అని మామ్మ కాళ్లమీద పడింది అనూష.

"సర్లేవే!... సరదాకన్నాను గానీ సంతోషంగా ఉద్యో గంలో చేరు! నేనుండగా త్వరగా పెళ్ళి కూడా చేసేసు కున్నావనుకో ఇంక హాయిగా గుటుక్కుమంటా!" అనంది రమణమ్మ నవ్వుతూ.

"అయ్యో!... నువ్వింకా కొన్నాళ్లుండాలి మామ్మా! నేనిప్పుడే పెళ్లి చేసుకోను. అయినా, ఫర్లేదులే! ఒకవేళ నువ్వు లేకపోయినా, ఈ ఏఐ సాయంతో నువ్వు నా పెళ్ళిలో ఉన్నట్టు నిన్ను మేం సృష్టించుకోగలంలే!..." అంది అల్లరిగా నవ్వుతూ అనూష.

"భడవా! నే బ్రతికుండగా పెళ్లి చేసుకోవుటే!?" అని ముద్దుగా తిట్టి...

"అయితే ఓ పని చెయ్! నువ్వు ఉద్యోగంలో చేరాక, మీ తాతని ఓసారి సృష్టించి, నాతో ఏవన్నా మాట్లాడిం చవే!" అనడిగింది ఆశగా ఆమె.


"ఇప్పటిదాకా తిట్టావు! ఇంతలోనే ఎంత ఆశ మామ్మా!" అని నవ్వి...


"అలాగే చూద్దాంలే! ఆ రోజులూ వస్తాయి!" అంది అనూష.

నవ్వులు విరిసాయి ఆ ఇంట్లో.

# ఏఐ మాయ

ప్రసిద్ధ









నల్లపాటి సురేంద్ర-9490792553

**నవీన్ లేవగానే ప్రపంచం మొత్తం యువత ఏమి చేస్తారో అదే చేశాడు... అదే ఫోన్ చూసుకోవడం!**

**అందులో మీకు గర్ల్ ఫ్రెండ్ లేరని బాధ పడు తున్నారా?... గర్ల్‌ఫ్రెండ్ లేని జీవితం వ్యర్థం అను కుంటున్నారా??... ఇప్పుడు మీకు నచ్చిన విధంగా, మీరు కోరిన విధంగా మీ మాట వినే గర్ల్ ఫ్రెండ్ మీరే ఎన్నుకోవచ్చు! రూపాయి ఖర్చు లేకుండా! అనే ప్రకటన ఆకర్షణీయంగా కనిపించినా నవీన్ సున్నితంగా తిరస్కరించాడు.**

రెండు నిమిషాలు మాత్రమే ఫోన్ చూద్దాం అనుకున్న చివరికి గంట పట్టింది బయటికి రావడానికి.

ఇంతలో ఫ్రెండ్ బర్త్ డే అని గుర్తొచ్చి ఫోన్ చేసాడు...

"హాయి మామ! హ్యాపీ బర్త్‌డే... పార్టీ ఎక్కడ?" అనగానే!...

"సారీ మామ! మన జూనియర్ రేవతితో లాంగ్ డ్రైవ్‌కి వెళ్తున్న" అని అనగానే...

"అవునా! టేక్ కేర్!" అంటూ చిరాకుగా ముఖం పెట్టి ఫోన్ కట్ చేశాడు.

అసలు నాకు ఏం తక్కువ, స్పోర్ట్స్ బైక్ లేదా? బ్యాంక్ బ్యాలెన్స్ లేదా? అందం లేదా ఎన్నిసార్లు ఆ పరిమళను చూసిన ఒక్కసారి కూడా నా వైపు చూడలేదు అంటూ బాధ పడ్డాడు.

అప్పుడే సెల్‌లో మరో మెసేజ్ వచ్చింది–

'అందరికీ గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నారు నాకే లేరు అనుకుంటున్నారా? మీకు నచ్చిన అమ్మాయి మీరు గర్ల్‌ఫ్రెండ్‌గా పొందవచ్చు! మీతో మాట్లాడటమే కాకుండా ముద్దు కూడా ఇస్తుంది... పైసా కూడా ఇవ్వనవసరం లేదు!' అనే ప్రకటన మరి ఆకట్టుకునే విధంగా టెంప్టింగ్‌గా ఉండటంతో...

సరే అనుకుని ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేసాడు నవీన్.

ఆ వెబ్‌సైట్ అంతా రంగులమయంగా చుట్టూ లవ్ సింబల్స్‌తో నిండిపోయి ఉంది.

'మీకు నచ్చిన అమ్మాయితో మాట్లాడాలి అనుకుంటున్నారా' అంటూ ఒక ఆడియో సందేశం.

'అవును' అని చెప్పాడు నవీన్.

'అయితే మీకు నచ్చిన అమ్మాయి ఫోటో మాకు పంపండి ఆ అమ్మాయితో మాట్లాడండి!' అనగానే...

నవీన్ వెంటనే టాలీవుడ్ టాప్ హీరోయిన్ ఫోటో పెట్టగానే ఆ హీరోయిన్ వెంటనే వీడియోలో వచ్చి– "హాయ్ నవీన్!... ఎలా ఉన్నావు?...' అనగానే షాక్ అయ్యాడు. చాలా హ్యాపీగా అనిపించి ఎన్నో మాటలు ఎన్నో ఊసులు చెప్పాడు.

అలా మాట్లాడుతుంటే ఒక ఐడియా వచ్చింది... తను ఎంతగానో ప్రేమించిన పరిమళ ఫోటో పెట్టి తనతో మాట్లాడితే ఎలా ఉంటుందో అని అనుకుని పరిమళ ఫోటో పెట్టగానే ఆమె వెంటనే ప్రత్యక్షం అయింది ఎగిరి గంతేశాడు!

"హాయ్ నవీన్ ఎలా ఉన్నావు?" అనగానే మెలికలు తిరుగుతూ...


"బాగున్న పరిమళ!" అంటూ ఆనందంగా ఉత్సాహంగా చెప్పాడు.

ఇంకా అప్పట్నుండి మొదలు...

పరిమళతో మాట్లాడుతూనే ఉండేవాడు. కాలేజీకి వెళ్తున్న కాలేజీ నుండి ఇంటికి వస్తున్న అదే ఆశ... అదే ధ్యాస!

కాలేజీలో ఉన్న అసలైన పరిమళ చూడక పోయినా మొబైల్‌లో పరిమళ ఉంది చాలు అను కున్నాడు.

కొద్దిరోజులు తర్వాత 'పరిమళతో మాట్లాడా లంటే నెలరోజులు అయితే వెయ్యి రూపాయలు సంవత్సరం అయితే పదివేలు కట్టాలి' అని చెప్ప గానే వెనక ముందు చూడకుండా పదివేలు కట్టాడు. ఇంకా అక్కడ నుండి సరసం కూడా మొదలు అయింది. మత్తులో దించి వేలుకి వేలు ఫోన్‌లో ఉన్న పరిమళ లాగేసింది.




బయటున్న పరిమళ కన్న సెల్‌లో ఉన్న

పరిమళకే ఎక్కువ విలువ ఇచ్చేవాడు. కొన్ని రోజులు పోయాక ఫ్రెండ్స్‌తో తన ఆనందాన్ని పంచుకున్నాడు.

"పరిమళ నాకు ఫోన్ చేస్తుంది... ముద్దు పెడుతుంది..." చెప్పగానే ఫ్రెండ్స్ నమ్మలేదు.

వాళ్ళకి నవీన్ తన సెల్ చూపించాడు... వీడియోలో మాట్లాడటం పర్సనల్ విషయాలు కూడా చెప్పడం చూసి వాళ్ళకి ఏం జరుగుతుందో అర్థం కాలేదు.

తర్వాత ఇది ఆ నోట ఈ నోట వెళ్లి చివరికి పరిమళ దగ్గరకి చేరింది.


"నేను నవీన్‌కి ఎప్పుడూ వీడియోకాల్ చేయలేదు!" ఫ్రెండ్స్‌కి వివరణ ఇచ్చింది పరిమళ.

కానీ ఫ్రెండ్స్ మాత్రం నిజం అని మేము కళ్ళారా చూశాం అనగానే...తాడుపేడో తేల్చుకోవాలని డిసైడ్ అయ్యి పరిమళ కోపంగా నవీన్ దగ్గరకి వెళ్ళింది.

నవీన్ తలవంచుకుని వెళ్ళిపోతుంటే ఆపి మరి అందరి ముందు అడిగింది.


కాసేపు నవీన్ తడబడిన చివరికి...

"నువు నన్ను ప్రేమించడం లేదని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అచ్చం నీలాగే ఉన్న అమ్మాయితో నా ప్రేమ వ్యక్త పరుచుకున్నా! అందులో తప్పేముంది?" అనగానే...




"నా అనుమతి లేకుండా నా ఫోటో వాడుకుంటావా?" అంటూ చెంప చెళ్లుమనిపించింది.

"పరిమళ నువ్వు ఎవరితో చెబుతావో చెప్పుకో!... ఫోన్‌లో ఉన్న పరిమళ నీలా టెంపర్ కాదు... తను సూపర్!... నిన్నే తన బట్టలుకి పదివేలు అకౌంట్‌లో వేసాను!" అంటూ అమాయకంగా మాట్లాడాడు.



"పదివేలు వేశావా ఎవరికి?"

"నీ రూపంలో ఉన్న పరిమళకి!"

"ఒరేయ్ పిచ్చోడా! ఎవరో నిన్ను ట్రాప్‌లో పడేశారు. ఇంకెంత ఖర్చు పెట్టావు?..." అంటూ పరిమళ అడిగేసరికి...

"బుగ్గనా ముద్దు పెడితే మూడు వేలు... ఐ లవ్ యూ చెపితే అయిదు వేలు..." ఇంకా చెబుతుంటే...

"ఒరేయ్ బాబు! ఇంకా ఆపేయ్! మొత్తం ఎంత ఇచ్చావు చెప్పు!"

"ఒక లక్ష వరకు !"

"లక్షా రూపాయలా??"

"ఎదురుగా ఉన్న నాకు ఎప్పుడైనా పదిరూపాయలు పెట్టి చాక్లెట్ కొన్నావా?" అంది పరిమళ.

"నాకేం తెలుసు! నిన్నే అని ఊహాలో ఉండిపోయా!..."

"నాకు ధైర్యం చేసి ప్రేమ విషయం చెప్పి ఉంటే నేను ప్రేమించేదానిని కదా?"

"మరి ఇప్పుడు ప్రేమించవా?"

"నన్ను ప్రేమించాలంటే అయిదు లక్షలు సంపాదించి చూపించు! అప్పుడు ప్రేమిస్తా! అప్పటివరకు నన్ను చూసిన నా వీడియోస్ చూసినా ఖబడ్దార్!" అంటూ వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయింది.

"ఈ ఆర్టిఫిషియల్ లవ్ నా అఫిషియల్ లవ్ దూరం చేసిందే!..." అంటూ లబోదిబోమన్నాడు నవీన్.




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*తెలుగు అధ్యాపకుడు, కె.బి.ఎన్ కళాశాల, విజయవాడ*
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

**“మ**న పోలీస్‌స్టేషన్‌కి కొత్తగా వచ్చిన ఎస్.ఐ భీమారావుగారు నిజంగా పేరుకు తగ్గట్టు భీముడేనండీ! చాలా గొప్ప సాహసం కలిగిన వాడట. ఇవాళ టౌన్‌హాల్‌లో సత్కారం చేస్తున్నారు. మీరూ రండి మాస్టారూ!” అంటూ తోటి ఉపాధ్యాయ మిత్రుడు భాస్కర్ పదే పదే అడగటంతో కాదనలేకపోయాను.

సభ మొదలు కావడానికి ఐదు నిమిషాలకు ముందే అక్కడకు చేరుకున్నాను.

తెలుగు మాస్టారు వచ్చారంటూ అభిమానులు పలకరింపులు ప్రారంభించారు.

“మీ దగ్గర చదువుకున్నాం మాస్టారూ!” అంటూ కొందరు పలకరించారు కానీ గుర్తుపట్టలేకపోయా. అదే మాట వారితో చెబుతూ, యోగక్షేమాలు తెలుసుకుంటున్నా.

ఇంతలో సభ ప్రారంభమైంది.


అధ్యక్షుడి ఉపన్యాసం, అతిథుల ఉపన్యాసాలు అయ్యాక భీమారావు గారు ప్రసంగం ప్రారంభించారు.

ప్రసంగం నదీ ప్రవాహం తీరులో సాగిపోతోంది.

“నేను గతంలో పనిచేసిన ప్రాంతం చాలా క్లిష్టమైంది. నేను అక్కడికి వెళ్ళే నాటికి నక్సలైట్ల సమస్య వివరీతంగా ఉండేది. అదొక ఉగ్రనేల. నక్సలైట్లకు పోలీసులకు మధ్య రసవత్తర పోరు జరుగుతుండేది. ఒక్కోసారి కాల్పుల ప్రభావం వల్ల చాలామంది అపస్మారకంలోకి వెళ్ళేవారు. ఎంతోమంది ఆగంతకులు ఆ ప్రాంతంలో తిరిగేవారు. ఇంకా చెప్పాలంటే అదొక గూండా రాజ్యం. దాన్ని బాగు చేయడానికి నేను అహర్నిశలు పడిన కష్టం అంతా ఇంతా కాదు...” భీమారావు గారి ప్రసంగం సాగిపోతూనే ఉంది. ఎస్.ఐ.గారి పరాక్రమం వింటున్న ప్రేక్షకులు బాగా ఉత్సాహంగా చప్పట్లు కొడుతున్నారు.

“ఏంటి మాస్టారూ!... అందరూ అంత ఉత్సాహంగా ఉంటుంటే మీరేంటి ఇంత నీరసంగా, ఏదో కోల్పోయినట్లు కనిపిస్తున్నారు. ఏం జరిగింది? ఆరోగ్యం బాగోలేదా?” అంటూ పలకరించాడు పక్క కుర్చీ పరంధామయ్య.

“అవునయ్యా! చాలా కోల్పోయాను. నిజం చెప్పాలంటే ఎంత కోల్పోయానో నాకే తెలియదు. ఎప్పటికప్పుడు లెక్క పెట్టుకుంటున్నా, చివరికి కచ్చితంగా ఇంత అని లెక్క తేలటం లేదు. ఎంతో జాగ్రత్తగా ఉందామని ప్రయత్నం చేస్తున్నా, ఇంకా కోల్పోతూనే ఉన్నా. నాతో పాటు అందరూ పోగొట్టుకుంటున్నారు!”




“ఏంటో మాస్టారూ... మీరేమంటున్నారో నాకర్థం కావడం లేదు. కాస్త వివరంగా చెప్పండి!...” అంటూ పరంధామయ్య బతిమిలాడుతున్నట్లు అడిగాడు.

“సరేనయ్యా... చెబుతాను...” అంటూ ప్రారంభించాను.

“ఎస్.ఐ గారి ప్రసంగం వింటున్నావు కదా! ఆయనేదో ఉగ్రనేలలో పనిచేసానంటున్నాడు. **ఉగ్రనేల** అనకూడదు. **ఉగ్రమైన నేల** అనాలి. లేదా **ఉగ్రభూమి** అనాలి... **రసవత్తరపోరు** అనే పదం కూడా తప్పే. **రసవత్తరమైన పోరు** అనాలి!... లేదా రసవత్తర సంగ్రామం అనాలి.

ఇక, ఎంత భీకరంగా యుద్ధం జరిగినా ఏ ఒక్కరూ అపస్మారకంలోకి వెళ్ళరు... ఎందుకంటే... **అపస్మారకం** అనే పదం తప్పు. **అపస్మారం** అని మాత్రమే రాయాలి. అలాగే చదవాలి... ఇక, ఏ ఒక్క చోటకీ ఆగంతకుడు రాడు... ఎందుకంటే **ఆగంతకుడు** అనే పదం తప్పు. **ఆగంతుకుడు** అని మాత్రమే రాయాలి...

మరీ చోద్యం ఏమిటంటే... ఆయనేదో **గూండా** రాజ్యాన్ని బాగుచేసాను అంటున్నాడు... అసలు అలాంటి రాజ్యమే ఉండదయ్యా! **గుండా** రాజ్యం అని మాత్రమే అనాలి. ఇక, ఆయన ఎంత బాగా అవిశ్రాంతంగా కష్టపడ్డా, దాన్ని **అహర్నిశలు** అన కూడదు. అసంబద్ధమైన పదం అది. **అహర్నిశము** అనాలి. లేదా అహర్నిశములు అనాలి...

ఏంటయ్యా ఈ మాటలు. ఒక్క పదం కూడా సరిగ్గా మాట్లాడలేదు. ఈయన ఎస్.ఐ ఎలా అయ్యాడు. అదిగో! విను... ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. ఇంకెన్ని తెలుగు పదాల్ని ఖూనీ చెయ్య డానికి సిద్ధపడుతున్నాడో...” అంటూ పక్కకు తిరిగేసరికి పరంధామయ్య కనిపించలేదు.

నీరసం వచ్చినట్లుంది పాపం! ఓ పక్కకు జారి పోయాడు.

నా ముఖంలో రంగులు మారటం చూసి, పరి స్థితి అర్థం చేసుకున్నాడు ఆ పక్కనే ఉన్న పాపా రావు.

మాస్టారూ... ఇదిగో మీరొట్టేసినట్లే... అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అసలే ఎస్.ఐ. పైగా చాలామంది నక్సలైట్లను ఎదుర్కొన్న వాడు. ఎందుకు మాస్టారూ అతడితో వైరం. వది లేయండి. మీరొక్క మాట మాట్లాడితే నా మీదొట్టే. ఇదే ఫైనల్. ఇంకేం మాట్లాడద్దు అంటూ పాత కాలం సినిమాల్లో అల్లు రామలింగయ్య తరహాలో వంకరలు తిరిగిపోయాడు.


చేసేదేం లేక నేనూ “సరే... నాకుగా నేనేం మాట్లాడను.” అంటూ మాటిచ్చేసా.


బతుకు జీవుడా అనుకున్నాడు పాపారావు.


కాసేపటికి...

“అద్భుతం... అమోఘం... ఎస్.ఐ. గారికి ధన్యవాదాలు!” అంటూ నిర్వాహకులు ప్రకటిం చడంతో... నేను కేవలం చేతులు మాత్రమే కలి పాను. మనసు తెలుగుతల్లి పాదాల మీద పెట్టి, క్షమాపణలు సమర్పించుకున్నా.

# ఏఐ మాయ



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## డబుల్ ఖర్మ !

**టైం అర్ధరాత్రిలోకి ఎంటర్ అవుతుండగా... దివాకర్ సెల్‌ఫోన్ రింగ్ అయింది. లిఫ్ట్ చేసి మాట్లాడగానే అది పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన కాల్ అని తెల్సి భయంగా**

**"ఎందుకు సార్ ఈ టైం లో ఫోన్ చేశారు?... ఏమి జరిగింది ?" అని అడిగాడు దివాకర్.**

"మీకు సుకుమార్ అనే కొడుకున్నాడా?" అని అడిగాడు ఫోన్ చేసిన వ్యక్తి.

"వున్నాడు సర్! ఏమైంది మా అబ్బాయికి?" అని భయంగా అడిగాడు.

"మీ అబ్బాయి ఏమీ కాలేదు గానీ మీ వాడు తాగి కారు డ్రైవ్ చేసి ఒకతనికి డ్యాష్ ఇచ్చాడు. దాంతో అతను స్పాట్‌లోనే చనిపోయాడు." అని చెప్పాడు.

"మా అబ్బాయి ఎక్కడున్నాడు సర్?..." కంగారుగా అడిగాడు.

"మా స్టేషన్‌లోనే వున్నాడు. మీరు తొందరగా రండి." అని అనగానే దివాకర్ యాజ్ ఇటీజ్‌గా బయలుదేరాడు.


టీనేజ్ వయసున్న తన కొడుకు కారు డ్రైవ్ చేయడం చూసి అందరితో గర్వంగా చెప్పుకునే వాడు దివాకర్. వాడు ఏదో ఒకరోజు ఇలాంటి కలకలం క్రియేట్ చేస్తాడని దివాకర్ ముందుగా అంచనా వేయలేక పోయాడు.

క్యాబ్‌లోంచి దిగి ఆదరాబాదరాగా పోలీస్ స్టేషన్‌లోకి వచ్చాడు దివాకర్. సుకుమార్ తాగిన మత్తులో ఇంకా జోగుతూ అక్కడున్న బెంచీ మీద కూర్చోని వున్నాడు.

తండ్రిని చూసిన సుకుమార్ వచ్చి... హగ్ చేసుకుని– "డాడ్! పోలీసు వాళ్ళకు డబ్బులిచ్చి నా మీద కేసు లేకుండా చేయండి ప్లీజ్! జైలుకు వెళ్ళడం నాకు ఇష్టం లేదు.అక్కడ మంచి ఫుడ్డు వుండదట... పైగా సెల్‌ఫోన్ కూడా ఇవ్వరంట!" తాగిన మత్తులో తన మనసులో వున్నది వాగేశాడు సుకుమార్.

ఆ వాగుడిని పోలీసువాళ్ళు వినకుండా దివాకర్ మ్యానేజ్ చేస్తూ– "సర్! వీడు డ్యాష్ ఇచ్చిన వ్యక్తిని నేను చూడాలి... ఎక్కడున్నాడు?" అని అడిగాడు దివాకర్

"ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో వున్నాడు. అతనెవరో తెలియడం లేదు. వాళ్ళ ఫ్యామిలీ మెంబర్స్ వస్తే మీ అబ్బాయి మీద కేసు పెడతారు. పైగా మీ అబ్బాయి మైనర్! అదీ తాగి డ్రైవ్ చేశాడు. మీ వాడు గ్యారంటీగా జువైనల్ హోం వెళ్ళాల్సి వుంటుంది. మైనర్ అయిన మీ అబ్బాయికి కారు ఇచ్చినందుకు మీ మీద కూడా కేసు ఫైల్ చేస్తాం!" అని బెదర కొట్టాడు సిఐ సింగన్న.




దాంతో బెదిరిపోయిన దివాకర్– "సర్!... కారు డ్రైవ్ చేసింది మా అబ్బాయి కాదని... చెప్పి మ్యానేజ్ చేయండి. నేను ఎవరినైనా తీసుకొస్తా అతని పేరు చెబుతాం! ఇలా చేసినందుకు మీకేమి కావాలో చెప్పండి!" అని డబ్బు గర్వంతో మిక్స్ అయిన మర్యాదతో చెప్పాడు.

యాక్సిడెంట్‌లో చనిపోయిన వాడు రౌడీ షీటర్! పైగా వాడి మీద కేసులు మెండుగా వున్నాయి. అందుకే సింగన్న ఇక్కడ తను దుష్ట శిక్షణ చేస్తున్నట్టు తప్పు లంచానికి ఆశపడి తను తప్పు చేయడం లేదని... తనని తాను కన్విన్స్ చేసుకుని–

"నేను అలా చేయాలంటే... నువ్వు పెద్ద అమౌంట్‌ని కోల్పోవాల్సి వుంటుంది." అని అన్నాడు.

"ఫర్వాలేదు సర్! మా అబ్బాయి మీద, నా మీద కేసు లేకుండా చేయండి చాలు!" అని అన్నాడు దివాకర్.

దివాకర్ దగ్గర బాగా డబ్బు వుందని పసిగట్టిన సిఐసింగన్న తను అనుకున్న దాని కంటే ఎక్కువ అమౌంట్ అడగొచ్చు అని మనసులో అనుకున్నాడు.

"సరే... నైతికతను పక్కన పెట్టి నాకు ఎందుకో నీకు మేలు చేయాలనిపిస్తోంది. ఓ పాతిక లక్షలు ఇవ్వు! మీ అబ్బాయి మీద గానీ నీ మీద కేసు లేకుండా నేను చూసుకుంటా!" అని అన్నాడు సిఐ సింగన్న.

"సార్ మీరు మరీ ఎక్కువ అడుగుతున్నారు! కాస్త తగ్గించి అడగండి ప్లీజ్..." అన్నాడు.

"సరే! ఫైనల్‌గా 24 లక్షలు ఇవ్వు!" అని దివాకర్ మరో మాట మాట్లకుండా...

"ఆ డబ్బు తీసుకుని వచ్చి మీ అబ్బాయిని ఇక్కడినుండి తొందరగా తీసుకుని వెళ్ళండి... లేకపోతే పరిస్థితి తారుమారు అవుతుంది." అని అన్నాడు సిఐ సింగన్న.

దివాకర్ ఇంటికెళ్ళి డబ్బు తీసుకొచ్చి... సింగన్నకు సమర్పించి తన సుపుత్రుడ్ని తనతో తీసుకుని వెళ్ళాడు. దాంతో తను పెద్ద గండం నుండి బయటపడ్డట్టు రిలీఫ్ ఫీల్ అయ్యాడు.

దివాకర్ తన కొడుకుని తీసుకుని ఇంటికి వచ్చాడు.

దివాకర్ కొడుకు డ్యాష్ ఇచ్చి చంపిన వ్యక్తిని టీవీన్యూస్‌లో చూపిస్తూ... హిట్ అండ్ రన్ ప్రమాదం కింద జమకట్టి చెబుతున్నారు. డ్యాష్ ఇచ్చిన వ్యక్తి ఎవరో తెలియలేదని సిఐ సింగన్న ప్రెస్ మీట్‌లో చెబుతున్నాడు. అది చూసిన దివాకరం కొడుకు బాత్‌రూమ్‌లో వున్న తన నాన్నని పిలిచాడు.

దివాకర్ వచ్చాక... "డాడీ! నేను డ్యాష్ కొట్టింది ఇతనినే!" అని చెప్పాడు.

ఆ వ్యక్తిని చూసిన దివాకరం మైండ్ బ్లాంక్ అయి కుప్పకూలిపోయాడు.

అతగాడికి ఎందుకు అలా జరిగిందో తెల్సు కోవాలంటే సమ్ డేస్ వెనక్కి వెళ్ళాలి.

✦ ✦ ✦


దివాకర్ అండ్ శాంతారాం మంచి ఫ్రెండ్స్. దివాకర్ ఎంత దుష్టుడో శాంతారాంకి తెలీదు. తనలాగే అందరూ మంచివాళ్ళే అని అనుకునే మనస్తత్వం శాతారాంది.

వీళ్ళకున్న ఫ్రెండ్ షిప్ కొద్దీ ఇద్దరూ తమ అవసరాలకి ఎప్పుడైనా డబ్బు కావలసినప్పుడు ఎన్ని లక్షలైనా నోటి మాటమీద ఇవ్వడం, తీసు కోవడం చేస్తారే తప్ప... అందునిమిత్తం ప్రామి సరీ నోటు లాంటివి రాసుకోవడం చేయరు.

ఇలా వుండగా... ఒకరోజు శాంతారాంకు హార్ట్‌లో పెయిన్‌గా వుందనీ... నడవాలంటే ఆయాసం వస్తోందని దివాకర్‌తో చెప్పాడు.

ఆయన చెప్పిన లక్షణాలు బట్టి చూస్తే... శాంతారాంకు తొందర్లో హార్ట్‌స్ట్రోక్ వచ్చే అవ కాశం వుందని గ్రహించాడు దివాకర్.

దాంతో దివాకర్ తన నీచపు బుద్ధికి పని




కల్పించాడు. శాంతారాం దగ్గర ఇప్పుడు అప్పు తీసుకుంటే... ఒకవేళ ఆయన చనిపోతే ఆ డబ్బు తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉండదని గ్రహించాడు. అందుకోసం తనకి అవసరం లేకపోయినా నెలరోజుల్లో ఇస్తానని చెప్పి... అప్పుగా యాభై లక్షలు శాంతారాంను అడిగి తీసుకున్నాడు. అదీ శాంతారాం నోట్ లేకుండా ఇచ్చాడు.

ఈ విషయం ఆయన ఫ్యామిలీ మెంబర్స్ కూడా తెలీదు.

మరుసటి రోజు శాంతారాం తన గుండెలో నొప్పి వుందని హాస్పిటల్లో జాయిన్ అయ్యాడు.

శాంతారాం చనిపోతే తనకి యాభై లక్షలు మిగిలిపోతాయని దివాకర్ ఆశించాడు.

కానీ దివాకర్ ఆశలు అడియాసలు చేస్తూ శాంతారాం కు డాక్టర్స్ స్టంట్స్ వేసి పంపించి వేశారు. ఆ తర్వాత శాంతారాం చాలా ఆరో గ్యంగా, చలాకీగా వున్నాడు.

శాంతారాం ఆరోగ్యం గురించి తెల్సుకున్న దివాకర్ తనకి దొరికిన పాతిక లక్షలు పోయి నట్టుగా ఫీల్ అయ్యాడు... ఆ అమౌంట్‌ని శాంతారాంకు తిరిగి ఇచ్చేయడం దివాకర్‌కు బిల్‌కుల్ ఇష్టం లేదు. ఏదో ఒకటి చేసి ఆ మొత్తాన్ని తన స్వంతం చేసుకోవాలని చాలా గట్టిగా నిర్ణయించుకున్నాడు.

అందుకు ఏం చేయాలో నిద్ర రాకుండా టాబ్లెట్స్ వేసుకుని మరా డే అండ్ నైట్ ఆలో చించాడు.

చివరికి దివాకర్‌కు దారుణమైన ఐడియా తోచింది. అదే శాంతారాంని శాశ్విత నిద్రలోకి పంపేయాలని! ఆ విషయం గురించి తన అంతరాత్మను అడిగాడు దివాకర్.

తన అంతరాత్మ కూడా థమ్సప్ చూపించి 'గో హె హెడ్' అని అంది. ఇంకేమీ ఆలోచించ కుండా కిరాయి కిల్లర్స్ కోసం శోధన చేశాడు. చివరికి జగ్గు అనే ఓ వ్యక్తి దొరికాడు. వాడితో ఇరవై లక్షలకు బేరం ఆడి అడ్వాన్స్‌గా పది లక్షలు ఇచ్చాడు దివాకర్.

ఈ విధంగా చూసుకున్నా తనకి ముప్పై లక్షలు మిగిలిపోతాయని ఆనందంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు దివాకర్.

మరుసటి రోజు నుండి శాంతారాం చావు వార్త కోసం వెయిట్ చేస్తూ వున్నాడు దివాకర్.

ఇంతకీ దివాకర్‌కు మైండ్‌బ్లాంక్ అయి ఎందుకు కుప్పకూలిపోయాడో తెల్సా?... దివాకర్ కొడుకు యాక్సిడెంట్ చేసి చంపింది ఎవర్నో కాదు కిల్లర్ జగ్గుని.

ఇప్పటికే సిఐ సింగన్నకు పాతిక లక్షలూ కిల్లర్ జగ్గుకి పదిలక్షలు ఇచ్చాడు... ఇక ఎలాగూ శాంతారాంకు యాభై లక్షలు ఇవ్వాల్సి వుంది.

అది గుర్తొచ్చి దివాకర్ ఒడ్డున పడ్డ చేపలా గిల గిలా కొట్టుకున్నాడు.

# పదానందం 17

కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | |
| | | | | 4 | | | |
| 5 | | | | | | 6 | 7 |
| | | 8 | 9 | | 10 | | |
| | 11 | | | | 12 | 13 | |
| 14 | | | | | | | |
| | | | 15 | 16 | | | |
| 17 | | | | | | 18 | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. సంక్రాంతికి గానం చేస్తూ తిరిగే దాసు (4)
3. ఆది (3)
4. ఖాతా, లెక్క (2)
5. వినోదముగా తిరిగేవాడు (3)
6. ఊదే వాద్యం (2)
8. కోపంతో మొహం ఎర్రబారితే ఈ దుంపతో పోలుస్తారు (4)
12. ప్రతిభాసామర్థ్యాలకు ఇచ్చేది (3)
14. అల్పాహారం, చిరుతిండి బాలేదు (4)
15. చచ్చినవారిని బ్రతికించే చెట్టు చెదిరిపోయింది (4)
17. చేతిగుడ్డ (3)
18. మేను, మొదలులేని అనుమానం... (2)

**నిలువు**

1. తొందర (4)
2. ఒక విషయాన్ని దాచి ఉంచడం (4)
3. చదువు రాని..........కదలలేని ఎద్దు అని సామెత (2)
4. పాము విప్పేది (3)
7. భూస్వామి, యజమాని (3)
9. చిరునవ్వు (4)
10. పైకొచ్చిన శిశువు (2)
11. ఒక పనికి అవసరమైన వస్తుసామగ్రి (4)
13. అసలే పొడుగుచెట్టు.... ఇప్పుడు 'పైకి' పెరిగింది (4)
16. గర్వం, పొగరు లాంటిది... (2)

సమాధానం వచ్చే సంచికలో


**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 అ | హం | 2 కా | రం | | 3 రి | దా | |
| ల్ల | | ర | | | గ | | 4 తి |
| 5 క | ల్యా | ణం | | 6 ప | డ | మ | ర |
| ల్లో | | | 7 కు | | పా | | గ |
| 8 లం | 9 క | కు | చే | టు | | 10 ఆ | లి |
| | ల | | లు | | 11 వం | క | |
| 12 బా | | 13 వా | డు | 14 క | | 15 తా | ళి |
| 16 బా | వు | టా | | 17 సి | పా | యి | |

మనోవికాసానికి మందు ఆనందం!
హాస్యానందం తోనే ఇది సాధ్యం!
చందాదారులుగా చేరండి. నవ్వుని మీ స్వంతం చేసుకోండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# మొక్క మనసు


...నువ్వేమో ముళ్ళజాతి పిచ్చి మొక్కవి..మన ప్రేమని పెద్దవాళ్ళు అంగీకరిస్తారంటావా!?
మనవాడు అలా అడ్డదిడ్డంగా పెరుగుతుంటే మీరసలు పట్టించుకోరేంవిటండీ!!
నేను పెద్దదాన్ని అయిపోయాను కదమ్మా! నన్ను ఉయ్యాలో నుండి క్రిందకు దింపమ్మా.. ఆడుకుంటా!!
నిజం చెప్పు! వీడు మన కొడుకేనా!?
నీ అంతస్థు ఎక్కడ.. నా అంతస్థు ఎక్కడ!?
ఈ ఆకురాలు కాలంలో నన్ను అల్లుకుని చలి నుండి రక్షించిన నీకు కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియడంలేదు..లతా!!

Hasyanandam January-2025 RNI No. APTEL 08387/01/1/2003-TC




**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 0866-2563824, 9676444548